1

నవతెలంగాణ

ఆదిలాబాద్

శుక్రవారం | నవంబర్ 15, 2024 | www.navatelangana.com

డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ఉట్నూర్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం 'ఆరోగ్య కళాశాల' కార్యక్రమంలో భాగంగా రెండో గురువారం డ్రగ్స్ వల్ల వచ్చే పర్యవసానాల గురించి కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రగ్స్ వల్ల వచ్చే నష్టాలను విద్యార్థులకు ప్రిన్సిపాల్ ధన్‌రాజ్ బోధించారు. కళాశాల సైన్స్ అధ్యాపకులు వినోద్, శివప్రసాద్ సైతం విద్యార్థులకు డ్రగ్స్‌తో కలిగే నష్టాలను చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, సువర్ణ, శ్రీలత, గణేష్, లక్ష్మణ్, తిరుపతి, సుజాత పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనానికి నిధులు పెంచాలని వినతి

నవతెలంగాణ-తాండూర్

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం పిల్లలకు అందిస్తున్న భోజన పథకానికి నిధులు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ కోరారు. గురువారం బెల్లంపల్లి ఎంఈఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లకు, గురుకులాలకు మెస్ చార్జీలు పెంచిన ప్రభుత్వం మధ్యాహ్న భోజననానికి కూడా నిధులు పెంచాలని కోరారు. కోడిగుడ్ల ధర రూ.7కు పెంచాలని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న తరుణంలో నాణ్యమైన భోజనం అందించాలంటే మధ్యాహ్న భోజనానికి నిధులు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.



క్వారీలో జంగిల్ సఫారీ

- అడవిలో 20కిలో మీటర్ల సఫారీ రైడ్
- గాంధారీ ఖిల్లా, అటవీ అందాల వీక్షణ
- పర్యాటకాభివృద్ధికి అటవీ శాఖ ఏర్పాట్లు

అటవీబ అందాలను వీక్షించేందుకు అటవీ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. క్వారీ నుండి గాంధారీ ఖిల్లా, క్వారీ నీటి కుంటలను, అటవీ జంతువులను వీక్షించేందుకు దట్టమైన అటవీ ప్రాంతంలో 20కిలో మీటర్ల మేర సఫారీ రైడ్ కోసం ట్రాక్ ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రానికి దగ్గరలో జంగిల్ సఫారీ రైడ్ ఏర్పాటు చేయనుండడంతో వీక్షకుల సంఖ్య పెరగనుంది. అటవీ అందాలను, జంతువులను చూడాలనుకునే వారి కల మరో వారం రోజుల్లో నెరవేరనుంది.

నవతెలంగాణ - హాజీపూర్

అటవీ అందాలను చూడాలన్న కోరిక ఉన్న వారు మొన్నటి వరకు 60కిలో మీటర్ల దూరంలోని జన్నారం కవ్వాల్ అభయారణ్యానికి పోవాల్సి వచ్చేది. ఇప్పుడు జిల్లా కేంద్రానికి దగ్గరలో మండల పరిధిలోని క్వారీలో జంగల్ సఫారీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. దట్టమైన అడవిలో 20కిలో మీటర్ల మేర పలు చారిత్రాత్మక ప్రాంతాలు, రకరకాల చెట్లు, శాఖాహార, మాంసాహార జంతువులను వీక్షించే అవకాశం రానుంది. ఏసీసీ క్వారీ రోడ్డులోని క్రషర్ వద్ద నుండి గాంధారీ ఖిల్లా, సల్పల వాగు, క్వారీ వెనుక నుండి 20కిలో మీటర్ల మేర 2 నుండి 3 గంటల పాటు అటవీ అందాలను తిలకించవచ్చు. అడవి మధ్యలో ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్లు, మంచెలు, వాచ్ టవర్లు కనువిందు చేయనున్నాయి. అడవిలో ఏర్పాటు చేసిన గడ్డి మైదానాల్లో జింక పిల్లల ఆటలు, నెమళ్ల నాట్యాలు, పిచ్చుకల రాగాలు, భారీ వృక్షాలు వీక్షకులను ఆకట్టుకోనున్నాయి.

శరవేగంగా కొనసాగుతున్న పనులు


క్వారీ అడవిలో జంగల్ సఫారీ కోసం పనులు కొనసాగుతున్నాయి. రూ.12లక్షలతో క్వారీ నీటి కుంటలో సోలార్ పంప్ సెట్ ఏర్పాటు చేసి 2కిలో మీటర్ల దూరం అడవిలో ఏర్పాటు చేసిన 3కుంటలలో నీటిని నింపుతున్నారు. ఈ కుంటలో నీరు నింపడంతో అడవి జంతువుల దాహార్తి తీరనుంది. ఈ కుంటల పక్కనుండే సఫారీ ట్రాక్ ఏర్పాటు చేయడంతో నీరు తాగడానికి వచ్చిన జంతువులను చూడొచ్చు. మరో రూ.12లక్షలతో అడవిలో 20కిలో మీటర్ల దూరంగా ప్రయాణించేందుకు వీలుగా 24మీటర్ల వెడల్పుతో పిచ్చి మొక్కలను తొలగించి అందులో 14 ఫీట్ల వెడల్పుతో సఫారీ వాహనం వెళ్లేందుకు వీలుగా చదును చేసి ట్రాక్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ అడవిలో నెమళ్లు, కుందేళ్లు, జింకలు, దుప్పులు, మెకాలు, తోడేళ్లు, నక్కలు, రేస్ కుక్కలు, ఎలుగు బంట్లు, అడవి దున్నలు, చిరుతలు, పులులు, వివిధ రకాల పక్షులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.



10 రోజుల్లో సఫారీ రైడ్ ప్రారంభం : అత్తె సుభాష్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్



అడవి అందాలను వీక్షించేందుకు క్వారీ అటవీ ప్రాంతంలో 20కిలో మీటర్ల సఫారీ ప్రయాణానికి ఏర్పాట్లు చేస్తున్నాం. 10 రోజుల్లో ఈ సఫారీ రైడ్ ప్రారంభం కానుంది. 6గురు ప్రయాణించేందుకు గాను ఒక్క ట్రిప్‌కు రూ.2వేల వరకు ధర నిర్ణయించే అవకాశం ఉంది. మొత్తంగా రూ.25లక్షల వరకు నిధులతో ఈ గాంధారీ జంగిల్ సఫారీ రైడ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. నెల రోజులుగా నిత్యం 25మంది కూలీలు, మిషనరీ సాయంతో ట్రాక్ నిర్మాణం పూర్తిచేశాం. అటవీ సిబ్బంది అతహుల్ల, రాజేందర్, సంతోష్ నిత్యం ఈ పనులను పర్యవేక్షిస్తూ పూర్తి చేశారు. అటవీ అందాలను చూడాలనుకునే వారికి ఇది మంచి అవకాశం.







వికారాబాద్ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

వికారాబాద్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర అధికారులపై దాడులకు పాల్పడిన వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని తహసీల్దార్ వనజారెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు గురువారం మధ్యాహ్న భోజన సమయంలో మండల పరిషత్, రెవెన్యూ అధికారులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.. మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావుతో కలిసి తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో ప్రజలకు మేలు చేయాలని తపించే అధికారులు, ఉద్యోగులపై ఉద్దేశపూర్వకంగా దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజల్లో భాగమనే విషయాన్ని గుర్తు చేశారు.



తాండూర్ : కలెక్టర్‌పై దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని బెల్లంపల్లి తహసీల్దార్ జోత్స్న అన్నారు. బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. కలెక్టర్‌పై దాడి ఘటనతో ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ మురళీధర్‌రావు, ఆదిలక్ష్మి డీటీ కల్పన, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

బొగ్గు నాణ్యత వారోత్సవాలు ప్రారంభం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలో, శ్రీరాంపూర్ ఉపరితల గని-2లో బొగ్గు నాణ్యత వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో బొగ్గు నాణ్యత పతాకావిష్కరణ ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఓసీలో మేనేజర్ బ్రాహ్మజీ చేశారు. అనంతరం కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు, అధికారులతో బొగ్గు నాణ్యత ప్రతిజ్ఞ చేయించారు. బొగ్గు నాణ్యత వారోత్సవాలలో భాగంగా జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోల్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఓఎస్డీ సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్షణ వారోత్సవాలు 14 నుండి 20వరకు కొనసాగుతాయన్నారు. వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును అందించాలంటే నాణ్యతే ప్రగతికి ప్రామాణికమని, నాణ్యత పరిరక్షణ అందరి బాధ్యత అని తెలిపారు. ప్రస్తుత పోటీ మార్కెట్లో విదేశాల నుండి దిగుమతి అవుతున్న నాణ్యమైన బొగ్గుకు దీటుగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సంస్థ కూడా తన బొగ్గు నాణ్యత ప్రమాణాలను మరింతగా పెంచుకుంటుందని చెప్పారు. నాణ్యమైన బొగ్గును రవాణా చేసినప్పుడే సంస్థ అభివృద్ధి బాటలో నడుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీసైదా, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు ఏరియా క్వాలిటీ ఇన్‌చార్జి వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, డీజీఎం సివిల్ ఆనంద్ కుమార్, ఎస్ఆర్పీ 1, 3 గ్రూప్ ఏజెంట్ వెంకటేశ్వర్లు, డీవైసీఎంఓ డాక్టర్ రమేష్ బాబు, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, డివైపీఎం దేవేందర్‌రెడ్డి, సీనియర్ పీఓ పి.కాంతారావు, ఐటీ అధికారి శ్రీనివాస్, లా ఆఫీసర్ ప్రబంధిత, అకౌంట్స్ ఆఫీసర్ పద్మ పాల్గొన్నారు.

రాంజీ సత్పాల్ సేవలు మరువలేనివి

నవతెలంగాణ-వాంకిడి

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తండ్రి అయిన రాంజీ సత్పాల్ సేవలు మరువలేనివని భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహల్కార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బుద్ధ విహార్‌లో ఏర్పాటు చేసిన జయంతి కార్యక్రమంలో మాట్లాడారు. 1848లో జన్మించిన రాంజీ సత్పాల్ మిలిట్రి సుబేదార్‌గా పనిచేసి ఆ కాలంలో ఎదుర్కొన్న అంటరానితనం నుండి సమాజాన్ని బయటపడేయడానికి కృషి చేశారన్నారు. తన 14వ కొడుకు అయిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను ఉన్నత చదువులు చదివించి భారత రాజ్యాంగ రచయితగా తీర్చిదిద్దిన తీరు మనందరికీ ఆదర్శమని, ప్రతి ఒక్కరూ రాంజీ సత్పాల్‌ని ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని కోరారు. అనంతరం బీఎస్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వినేష్ ఉగ్రే, మండల అధ్యక్షులు జైరాం ఉగ్రే రాంజీ సత్పాల్ జీవిత చరిత్రపై మాట్లాడారు. కార్యక్రమంలో బౌద్ధ సమాజ్ అధ్యక్షులు ఆర్.ప్రసాద్ మహాత్మా, విజయ్ ఉగ్రే, వర్షపాస్ కమిటీ అధ్యక్షులు ప్రశాంత్, అంబేద్కర్ సంఘం నాయకులు రోషన్ ఉగ్రే, ప్రతాప్ రాంటేకే, అరుణ్ మహల్కార్, బల్వంత్ ఉగ్రే, సురేష్, శివాజీ, దుర్గం మనోజ్, అజయ్ దుర్గం, సంతోష్ దుర్గం, చంద్రమని, దిలీప్, నూతన్, రమేష్, రితేష్, తుకుడు, అరుణ్ జాడే పాల్గొన్నారు.

వసతిగృహం పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నవతెలంగాణ-సిఫాబాద్

జిల్లాలో నర్సింగ్ కళాశాల విద్యార్థినులకు వసతి కల్పించేందుకు చేపట్టిన వసతిగృహం పనులను త్వరితగతిన పూర్తి చేసి అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో పాత కలెక్టరేట్ వైటిసి భవనంలో నర్సింగ్ కళాశాల విద్యార్థినులకు వసతి గృహం ఏర్పాటు కొరకు చేపట్టిన పనులను జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహంలో విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో పనులు చేపట్టాలని తెలిపారు. భవన మరమ్మత్తులు, మూత్రశాలలు ఇతర పనులను వెంటనే పూర్తి చేసి నర్సింగ్ కళాశాల కొరకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

పాఠశాల విద్యార్థుల భద్రత దృష్ట్యా ప్రహరీ గోడ నిర్మించాలని, అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం ఆసిఫాబాద్ మండలం మోతుగూడ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఎస్ఎం డివి.శ్రీనివాస్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పాఠశాల జాతీయ రహదారికి సమీపంలో ఉన్నందున విద్యార్థుల భద్రత దృష్ట్యా ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని విద్యాశాఖ, ఇంజనీర్ అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, వంటశాల, మూత్రశాలలు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు.



గోదావరి ముంపు బాధితులను ఆదుకోవాలి

- సాగు భూములకు పట్టాలు, హక్కు పత్రాలు ఇవ్వాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి

నవతెలంగాణ-జైపూర్

కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో ముంపుకు గురవతున్న భూములకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. గురువారం చెన్నూర్ ఏరియా కమిటీ సమావేశంలో మాట్లాడారు. పెత్తందార్ల కుట్రలకు పేదల బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణహిత నదితో పాటు కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో నాలుగు సంవత్సరాలుగా కోటపల్లి, జైపూర్, వేమనపల్లి, చెన్నూర్, మంచిర్యాల జిల్లాలకు చెందిన రైతులు పంటలను నష్టపోతున్నారన్నారు. అంతే కాకుండా వరదల కారణంగా ఆస్తులు నష్టపోయి ఆర్థికంగా చితికిపోతున్నారని అన్నారు. సుమారు రూ.12వేల కోట్ల నష్టం జరిగిందన్నారు. నష్టపోయిన వారికి ప్రభుత్వం నుండి ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం అందలేదని వాపోయాడు. చెన్నూర్ ప్రాంతానికి చెందిన పెత్తందారలు, అధికారులు, ప్రజాప్రతినిదుల అండతో తమ స్వార్థం కోసం అక్రమంగా ఆస్తులు సంపాదించుకుంటున్నారని పేర్కొన్నారు. పేద ప్రజలను కూలి పేరుతో ముందు వరుసలో నిలిపి వారికి తెలియకుండా వారితో తప్పులు చేయించి తప్పుడు కేసుల్లో ఇరికించి జైలు పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగులో ఉన్న భూములకు పట్టాలు, హక్కు పత్రాలు ఇవ్వకపోవడంతో అటవీ అధికారులు రైతులపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలపై రాబోవు రోజుల్లో పార్టీ ఉద్యమబాట పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎర్మ పున్నం, చెన్నూర్ ఏరియా కార్యదర్శి బోడంకి చందు, జిల్లా కమిటీ సభ్యురాలు సామల ఉమారాణి, నాయకులు రాతిపల్లి నగేష్, సిడాం సమ్మక్క, బోండ్ల సరిత, నాగజ్యోతి, పాయిరాల రాములు, తుమ్మ రేణుక, బండారి రాజేశ్వరి, బోయిరె రమాదేవి, గావిడి భూదక్క, యామిని, మంత్రి లక్ష్మి, జిమిడి లక్ష్మక్క, బొందయ్య పాల్గొన్నారు.





ఎతికల్ లెర్నింగ్ అండ్ సోషల్ వాల్యూస్‌పై విద్యార్థులకు అవగాహన

మందమర్రి : వాయిస్ ఆఫ్ ద పీపుల్ ఎన్జిఓ సోషల్ వర్కర్స్ టీం ఆధ్వర్యంలో టీజీ మోడల్ స్కూల్ అండ్ కాలేజీలో గురువారం ఎతికల్ లెర్నింగ్ అండ్ సోషల్ వాల్యూస్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. 20మంది చిన్నారులు ఫ్యాన్సీ డ్రెస్‌లో వివిధ వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సారా తస్లీమ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీని సందర్శించిన కలెక్టర్

- సానుకూల దృక్పథంతో ఉండాలని ఉద్బోధ



నవతెలంగాణ-ముథోల్

బాసర ట్రిపుల్ ఐటిని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం సందర్శించారు. క్యాంపస్ పరిపాలన భవనానికి విచ్చేసిన కలెక్టర్‌కు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్ స్వాగతం పలికారు. తదనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో 17కమిటీలతో కూడిన విద్యార్థులతో కలెక్టర్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మనిషి జీవితంలో హెచ్చుతగ్గులు ఉంటాయని, ధైర్యంగా అధిగమించాలని సూచించారు. నూతన ఆలోచనలతో నూతన ఆవిష్కరణలకు అంకురార్పణ చేసే విధంగా మన ఆలోచన విధానం ఉండాలని పేర్కొన్నారు. వివిధ పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులకు ప్రొఫైల్ యాప్‌ను రూపొందించాలని కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు సూచించారు. ప్రతిభతో రాణించేందుకు తగిన ప్రణాళికలను రచించుకోవాలని పేర్కొన్నారు. మన ఆలోచన విధానమే మన మార్పుకు నాంది పలుకుతుందని తెలిపారు. అలాగే స్టూడెంట్ ఆక్టివిటీ సెంటర్‌లో గల ఆడిటోరియంలో పియుసి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. మన చుట్టూ ఉన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఒకరికొకరుగా సహాయ సహకారాలు అందిస్తూ ముందుకెళ్లాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ నెల నుండి తీసుకున్న చర్యలను ప్రస్తావించారు. విశ్వవిద్యాలయం అభివృద్ధి కోసం అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు పరిపాలన అధికారులు ప్రభుత్వ సహకారంతో విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి, అసోసియేట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ నాగరాజు, వివిధ విభాగాల అధికారులు, ఆర్డిఓ, తహసీల్దార్ క్యాంపస్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

సహకార కార్యాలయాల్లో జెండావిష్కరణలు



నవతెలంగాణ-కౌటాల

71వ అఖిల భారత సహకార సంఘం వారోత్సవాల సందర్భంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గురుడుపేట్‌లో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొమురం మాంతయ్య జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు శైలేష్, హరిదాస్, సీఈఓ రాజేష్, అమీర్ హుస్సేన్, భీర్‌కుమార్, నాందేవ్ పాల్గొన్నారు.

జైపూర్ : మండల కేంద్రంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం కార్యాలయంలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా గురువారం సహకార సంఘం కార్యాలయం ఆవరణలో డైరెక్టర్ పానుగంటి లక్ష్మణ్ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్లతో పాటు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని రాజురా గ్రామానికి చెందిన దావత్ పోశెట్టి అనే రైతు ఇల్లు బుధవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి సమయంలో షార్ట్ సర్క్యూట్ కావడంతో ఇంట్లో ఉన్న సామగ్రితో పాటు 25 క్వింటాళ్ల పత్తి కాలిపోయిందని తెలిపారు. సుమారు రూ.2లక్షల వరకు నష్టం జరిగిందని రైతు వాపోయాడు. తనకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.



విద్యార్థులకు స్వెటర్ల పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని బ్రాహ్మణవాడ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త మౌనిష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది కోరిక మేరకు విద్యార్థులకు చలి నుంచి రక్షణ కోసం వందకి పైగా స్వెటర్లను అందజేశారు. అంతకుముందు చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు శ్రీకాంత్‌గౌడ్, సుజాత్‌ఖాన్, శ్రీకాంత్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు స్వామి, ఫిరోజ్, పనకంటి మహేష్, కళ ఉన్నారు.



దాతలు ముందుకు రావడం అభినందనీయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను కల్పించేలా దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎంఈఓ సోమయ్య అన్నారు. గురువారం పట్టణంలోని బ్రహ్మణవాడ ప్రాథమికోన్నత పాఠశాలకు నీలొమ ఆడనేశ్వర్ సేవా సమితి వారు ప్యూరీఫైడ్ ఆర్వో ప్లాంట్, కూలింగ్ ఫ్రిజ్‌ను అందించగా, ఎంఈఓ ప్రారంభించారు. ముందుగా కాంప్లెక్స్ హెచ్ఎం లచ్చిరాంతో పాటు ఎంఈఓను సత్కరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు అలరించారు. ఈ సందర్భంగా ఏంఈఓ సోమయ్య మాట్లాడుతూ ప్రభుత్వ బలోపేతం కోసం దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం సంతోషకరమైన విషయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు శుద్ధ జలం అందించాలనే ఉద్దేశంతో నిలోమ ఆడనేశ్వర్ సేవా సమితి వారు రూ.51వేలతో ఆర్ఓ ప్లాంట్, ఫ్రిజ్ ఇవ్వడం అభినందనీయమన్నారు. దాతలు ఇలాగే ముందుకు వచ్చి ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం సహకారం అదించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం స్వామి, ఉపాధ్యాయులు అపర్ణ, సాయిప్రియ, వాణి, అనిల్, హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ దర్శినిలో సైన్స్ విద్యార్థులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ దర్శిని కార్యక్రమానికి ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు సమీప దర్శనీయ స్థలాలు, చారిత్రక ప్రదేశాలు, పర్యాటక ప్రాంతాలను ప్రభుత్వ ఖర్చులతో చూపెడతారు. సైన్స్ డిగ్రీ కళాశాల యువ టూరిజం క్లబ్ విద్యార్థులు తెలంగాణ దర్శిని కార్యక్రమంలో భాగంగా ఇతర విద్యార్థులతో కలిసి పొచ్చెర జలపాతాన్ని సందర్శించారు. తెలంగాణ దర్శిని కార్యక్రమం వల్ల విద్యార్థులకు తమ ప్రాంత భౌగోళిక, చారిత్రక స్థితిగతులు అవగాహన అవుతాయని, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జగ్‌రామ్ అంతర్వేది పేర్కొన్నారు. కార్యక్రమంలో యువ టూరిజం క్లబ్ కోఆర్డినేటర్ పత్తివార్ శ్రీనివాస్, సభ్యులు రడాపు సంతోష్ కుమార్, డీఎస్ చక్రవర్తి, అధ్యాపకులు, అరుణ్ కుమార్, మంజుల, శ్రావణి, శ్రీధర్, జ్యోత్స్న, రాజ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పొచ్చెర జలపాతానికి వెళ్లిన విద్యార్థులు...

తెలంగాణ దర్శిని సందర్భంగా పర్యటకశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆయా పాఠశాల, కళాశాల విద్యార్థులకు గురువారం బోథ్ మండలం పొచ్చెర జలపాతం సందర్శనకు తీసుకెళ్లారు. కార్యక్రమ ప్రారంభానికి అదనపు కలెక్టర్ శ్యామలాదేవి జెండా ఊపి బస్సును ప్రారంభించారు. విహార యాత్రల వల్ల విద్యార్థులకు విజ్ఞానంతో పాటు వినోదం లభిస్తుందని ఆమె కొనియాడారు. మొత్తం 43 మంది విద్యార్థులను తీసుకెళ్లగా, 11 మంది గైడ్ టీచర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఐఈఓ రవీందర్, టూరిజం అధికారి రవి కుమార్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ ఆర్ఎం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్టీసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ ఆర్టీసీ ఆర్ఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సొలొమాన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజల సలహాలు సూచనలు, ఫిర్యాదుల కొరకు ఈ 9959226000 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

డయల్ యువర్ డీఎం..

ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆర్టీసీ డిపో మేనేజర్ కే.కల్పన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజల సలహాలు సూచనలు, ఫిర్యాదుల కొరకు 9959226002 ఈ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

సోయా కొనుగోళ్లు నిలిపివేత

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో సోయల నిలువ అధికంగా ఉండటంతో సొయల కొనుగోలు కేంద్రాన్ని 15నుంచి శుక్రవారం నుంచి 17 ఆదివారం వరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని తిరిగి మరల 18న సోమవారం నుంచి కోనుగోళ్ల ప్రారంభిస్తామని సెంటర్ ఇన్‌చార్జి నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-నార్నూర్

మండలం కేంద్రానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్, కాంగ్రెస్ నాయకులు షేక్ దాదే ఆలీ తండ్రి ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షులు విశ్వప్రసాద్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు గజానంద్ నాయక్, రాథోడ్ శేషరావ్, జేఏసీ మాజీ చైర్మెన్ రాథోడ్ ఉత్తం, మాజీ జెడ్పీటీసీ బ్రీజులాల్, నాయకులు మల్లేష్, మునీర్, దేవరావ్ లోఖండే, రాథోడ్ దత్తరాం, కరీంఖాన్, సయ్యద్ ఖాసీం, ఫెరోజ్‌ఖాన్ ఉన్నారు.

బీజేపీకి అపూర్వ ఆదరణ

నవతెలంగాణ-భైంసా

గ్రామ గ్రామాన బీజేపీకి అపూర్వ ఆదరణ లభిస్తుందని పెద్ద మొత్తంలో ప్రజలు సభ్యత్వ నమోదులో భాగస్వాములు అవుతున్నారని బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా కోఆర్డినేటర్ సిరం సుష్మారెడ్డి అన్నారు. గురువారం సంస్థాగత ఎన్నికల పర్వంలో భాగంగా తిమ్మాపూర్ శక్తి కేంద్ర ఇన్‌చార్జి దుబాయ్ శీను ఆధ్వర్యంలో ప్రతి బూత్‌లో సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలంలోని తిమ్మాపూర్, వానస్‌పాడ్, పెండెపెల్లి, సుంక్లీ, గ్రామాల్లో కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమాల్లో నాయకులు రామారావు, చందర్ పటేల్, నర్సయ్య, రవీందర్ ఉన్నారు.

ఆరోగ్యంగా ఉండి ఆనందంతో చదవాలి

• ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-తాంసి

విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే ఆనందంగా చదువుకోగలుగుతారని జిల్లా కలెక్టర్ రాజర్షిషా విద్యార్థులకు సూచించారు. గురువారం తాంసి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో కలెక్టర్ రాజర్షిషా బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా ఆరోగ్య పాఠశాల, ఆరోగ్య కళాశాలను ప్రారంభించారు. కలెక్టర్ నేతృత్వంలో శ్రీకారం చుట్టిన ఈ కార్యక్రమం జిల్లాల్లోని అన్ని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా, ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవాటు చేసేందుకు, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సామాజిక నైపుణ్యాలు పెంపొందించడం కోసం రూపొందించిన కార్యక్రమమే ఆరోగ్య పాఠశాల. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 14 నుంచి అన్ని ఉన్నత పాఠశాలల్లో, కేజీబీవీ, ఇంటర్ కళాశాలల్లో ప్రారంభించామన్నారు. ఆరు ఆరోగ్య సూత్రాలను, ఆరు రోజులు ఒక్కో రోజు ఒక్కో అంశాన్ని అమలు చేయనున్నారని తెలిపారు. 4 వారాల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రతి సోమవారం వ్యక్తిగత పరిశుభ్రత, ప్రతి మంగళవారం పోషకాహారంపై అవగాహన, ప్రతి బుధవారం ఒత్తిడి నివారించుకునే మార్గాలు, ప్రతి గురువారం డ్రగ్స్‌కు దూరంగా ఉండటం, ప్రతి శుక్రవారం కాలానుగత వ్యాధుల నివారణ, ప్రతి శనివారం వ్యక్తిత్వ వికాసం ఈ ఆరు సూత్రాలపై విద్యార్థులకు అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు. గురువారం డ్రగ్స్, మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. రేపటి భావిభారత పౌరులు మీరేనని, చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. మద్యం, పొగాకు వంటి వాటికి దూరంగా ఉండి, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, చదువులో రానిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకొని ఆదర్శవంతంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం నిరంతరంగా కొనసాగేలా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలని తెలియజేశారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడు మాత్రమే విద్యా నైపుణ్యాలను సాధించగలరని అందుకోసం ఈ కార్యక్రమం దోహద పడుతుందని తెలియజేశారు. విద్యార్థులకు టాయిలెట్లు అవసరమని కలెక్టర్‌ను ప్రధానోపాధ్యాయులు కోరగా వెంటనే స్పందించి, టాయిలెట్ల ఎన్ఆర్ఈజీఎస్‌లో మంజూరు చేస్తానని అన్నారు. అనంతరం సమగ్ర సర్వేను పరిశీలించి, పకడ్బందిగా సర్వే నిర్వహించాలని తహసీల్దార్, ఎంపీడీఓకు సూచించారు. ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్, మలేరియా అధికారి డాక్టర్ శ్రీధర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శ్రావ్యవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటకు మద్దతు ధర దక్కేలా చూడాలి

• కలెక్టర్‌కు అఖిలపక్ష రైతు సంఘం వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పత్తి కొనుగోళ్ల విషయంలో రైతులకు న్యాయం చేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అధికార యంత్రాంగం, స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ విషయమై ప్రత్యేక దృష్టి సారించి ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు సరైన ధర దక్కేలా చూడాల్సిన అవసరముందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న అన్నారు. అఖిల పక్ష రైతు సంఘం నాయకులతో కలిసి గురువారం జిల్లా కలెక్టర్ రాజర్షిషాను కలిశారు. పత్తి కొనుగోళ్ల జరుగుతున్న తీరు, మద్దతు ధర దక్కక రైతులు పడుతున్న ఇబ్బందులు తదితర అంశాలపై చర్చించారు. అన్నదాతకు ఎట్టి పరిస్థితుల్లోనూ న్యాయం జరగాలని, పెట్టుబడి ఖర్చు కూడా దక్కక రైతులు ఇక్కట్లకు గురవుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన విధానాలను వివరించారు. ప్రయివేటు వ్యాపారస్తులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న వైనాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇతర రాష్ట్రాల్లో కొనుగోళ్లు జరుగుతున్న విషయాన్ని ప్రస్తావించారు. అయా రాష్ట్రాల్లో స్టడీ టూర్ చేపట్టేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో పత్తి, సోయా పంటల కొనుగోళ్ల సమయంలో ప్రయివేటు వ్యాపారస్తులు, సీసీఐని ఒప్పించి మంచి ధర అందేలా కృషి చేశామని అన్నారు. తేమ శాతం పద్దెనిమిది వరకు ఉన్నప్పటికీ పన్నెండు లోపు పరిగణలోకి తీసుకుని కొనుగోళ్ల జరిగేలా చూసామని పేర్కొన్నారు. ప్రస్తుతం రైతులకు పెట్టుబడి ఖర్చు వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ స్వలాభం కోసం తాము పని చేయడం లేదన్నారు. రైతుకు న్యాయం జరగేలా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సూచించారు. అధికార యంత్రాంగం, స్థానిక ప్రజా ప్రతినిధులు నిత్యం మార్కెట్‌లో పరిస్థితులను తెలుసుకుంటూ రైతులకు అండగా నిలవాలని తెలిపారు. అవసరమైతే ప్రభుత్వం నుంచి ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న కొనుగోళ్లను పరిశీలించేందుకు స్టడీ టూర్‌కు వెళ్తామని, లేనిపక్షంలో తాము తలా కొంత జమ చేసైనా ఇతర రాష్ట్రాలకు వెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష రైతు సంఘం జిల్లా కన్వీనర్ బండి దత్తాత్రి, కొండ రమేష్, గోవర్ధన్ యాదవ్, లోకారి పోశెట్టి, దేవిదాస్, లక్ష్మణ్, రోకండ్ల రమేష్, లింగారెడ్డి, నారాయణ, కుమ్ర రాజు, బట్టు సతీష్, విఠల్ పాల్గొన్నారు.

దేశం పురోగతి మంచివారీగా ఎదిగినప్పుడే సాధ్యం

• డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశ తొలి ప్రధాని చాచా నెహ్రూ చెప్పినట్టుగా నేటి బాలలే రేపటి పౌరులని, సమాజంలో వారు మంచి వారుగా ఎదిగినప్పుడే దేశం మరింత పురోగతి సాధిస్తుందని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని గజిటెడ్ నెంబర్-2 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై బాలలకు రాజ్యాంగంలో కల్పించిన హక్కులపై వివరించారు. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య మాట్లాడుతూ బాలలకు ఎన్నో హక్కులుంటాయని, వాటిపై విస్తృత అవగాహన కలిగి ఉండాలని అన్నారు. లింగ బేదం లేకుండా తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలన్నారు. విద్యార్థులు విలువలతో కూడిన విద్యను నేర్చుకుని, సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలని, దేశానికి మంచి సేవలందించాలని ఆకాంక్షించారు. అనంతరం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను విజేతలుగా ఎంపిక చేసి వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఉపాధ్యాయులు బచన్ సింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చక్రస్నాన మహోత్సవం



నవతెలంగాణ-తాంసి

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని భీంపూర్ మండలం వడూర్ సమీపంలోని పెన్‌గంగ నదిలో గురువారం చక్రస్నాన మహోత్సవాన్ని ఎంతో అంగరంగ వైభవంగా శివానంద భారతి స్వామి యజ్ఞ పూజా కార్యక్రమాలతో నిర్వహించారు. బుధవారం రాత్రి కోటి దీపోత్సవం నిర్వహించి, రాత్రి భజన సంకీర్తన ప్రచారాలు కొనసాగించి, గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల విగ్రహాలతో పాటు భక్తులందరూ కలిసి చక్ర స్నానం చేశారు. డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ మహోత్సవ కార్యక్రమానికి భీంపూర్ మండలంలోని చుట్టుపక్కల గ్రామాలతో పాటు మహారాష్ట్రలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు. వచ్చిన భక్తుల సౌకర్యార్థం అన్న ప్రసాద కార్యక్రమాలు గ్రామస్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్డి బోజారెడ్డి మాట్లాడుతూ గత ఎన్నో సంవత్సరాల నుంచి కోటి దీపోత్సవ కార్యక్రమంతో పాటు చక్రస్నాన మహోత్సవాన్ని గ్రామస్తులందరి సహకారంతో కొనసాగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు సంజీవరెడ్డి, దేవారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్ ఉన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభించాలి

• టీఏజీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఏజెన్సీలోని ఆదివాసులు నివసిస్తున్న గ్రామాలకు నిధులు మంజూరైన బీటీ రోడ్ల పనులు ప్రారంభించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు అన్నారు. గురువారం దీనికి సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. ఇంద్రవెల్లి మండలంలోని పిప్రి నుంచి చిలాటిగూడ వరకు రూ.69 లక్షలు, నర్సాపూర్ అడగూడకు రూ.25లక్షలు బీటీ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయన్నారు. అయిన ఇంజనీరింగ్‌శాఖ అధికారులు ఇంత వరకు రోడ్డు పనులు ప్రారంభించలేదని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తాకు వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో కే.మల్క్ ఉన్నారు.

108లో గర్భిణీ ప్రసవం

నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండలంలోని పరస్వాడ(బి) గ్రామపంచాయతీ పరిధిలోని హిరపూర్ గ్రామానికి చెందిన కుద్మేత దీపికా గర్భిణీకి గురువారం పురిటి నొప్పుల రావడంతో 108 అంబులెన్స్‌ను పిలిపించారు. నొప్పులు ఎక్కువగా కావడంతో మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించే క్రమంలో సాత్నాల పరిధిలో 108 సిబ్బంది సహకారంతో మధ్యలోనే పండంటి అడ బిడ్డకు జన్మించింది. తల్లిబిడ్డ సురక్షితంగా ఉన్నట్టు ఈఎంటీ సంతోష్, పైలెట్ నాందేవ్ తెలిపారు. మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట ఆశా కార్యకర్త జంగుబాయి ఉన్నారు.

కృష్ణవేణి పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొబైల్ ప్లానిటేరియన్ ప్రదర్శించారు. ఇందులో భాగంగా విద్యార్థి, విద్యార్థులకు నక్షత్రాలు, గ్రహాల గురించి డైనోసర్స్, టైటానిక్ షిప్ గురించి వివరించారు. సముద్రపు చేపల గురించి వివరంగా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గాండ్ల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ జి రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లహుజీ సాల్వే సేవలు మరువలేనివి

నవతెలంగాణ-నార్నూర్

లహుజీ సాల్వే సేవలు మరువలేనివని డాక్టర్ గణేష్ మోతేవాడ్ అన్నారు. సాల్వే 231వ జయంతి సందర్భంగా గురువారం మండల కేంద్రంలో ఆర్ఎంపీ, పీఎంపీ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాహుజి సాల్వే త్యాగాలను మర్చిపోవద్దని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు పుష్కర్ సాగర్, గుట్టే జనార్ధన్, కాంబ్లే దయానంద్, రాథోడ్ మహేష్, కిషన్, నారాయణ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఖానాపూర్

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. గురువారం ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని అన్నారు. అంతేకాకుండా యువత గంజాయి మత్తులో పడి వారి జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. సైబర్ నేరాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా ఖానాపూర్ శివారులోని డబుల్ బెడ్ రూమ్ ఏరియాలో త్వరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు చరణ్‌సింగ్ భార్య మౌనిక(38) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు, సీనియర్ నాయకులు వడ్డే రాజేందర్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతి గల కారణాలు అడిగి తెలుసుకుని ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. వారి వెంట నాయకులు మధు, గణపతి, నారాయణ, రామ్‌రెడ్డి ఉన్నారు.

వేములవాడకు ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

కార్తీక మాసాన్ని పురస్కరించుకొని శుక్ర, శని, ఆది, సోమవారాలు ఈ నెల 15 నుంచి 18, తేదీ వరకు వేములవాడకు ప్రత్యేక బస్సు నడుపుతున్నట్టు డిపోమేనేజర్ ప్రతిమారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు బయలుదేరి వేములవాడకు ఉదయం 10.15 కు చేరుకుంటుంది. తిరిగి మధ్యాహ్నం 1గంటలకు వేములవాడ నుంచి బయలుదేరి సాయంత్రం 4.15నిమిషాలకు నిర్మల్ చేరుకుంటుంది. ఛార్జీలు పెద్దలకు రూ.260, పిల్లలకు రూ.140 ఉంటుందని నిర్మల్ పట్టణ పరిసర శివ భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని డిపోమేనేజర్ తెలిపారు.

ప్రయాణికుల కోసమే డయల్ యువర్ డిఎం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రయాణికుల సౌకర్యార్థం మరింత నాణ్యమైన సేవలందించే ఉద్దేశంతో డయల్ యువర్ డిఎం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులలో వివిధ ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేరవడమే తమ లక్ష్యమన్నారు. ప్రయాణికుల సమస్యల పరిష్కరించేందుకుగాను శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రయాణికులు ఆసిఫాబాద్ డిపోల బస్సులకు సంబంధించిన తమ సమస్యలు, సలహాలు సమాచారం కోసం 9959226006 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సంక్షేమ వసతి గృహాల్లో మెస్ చార్జీలు పెంచాలి

నవతెలంగాణ-కెరమెరి



సంక్షేమ వసతి గృహాల్లో మెస్ చార్జీలను పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సతీష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో మండల విద్యాధికారి ఆడే ప్రకాష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెస్ ఛార్జీలను పెంచిందని తెలిపారు. పెంచిన మెస్ చార్జీలకు అనుగుణంగా ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కరణ్, అధ్యక్షురాలు సంగీత, మండల నాయకులు గణేష్, బాలాజీ, సౌమ్య పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఈనెల 17, 18 తేదీలలో జరగనున్న గ్రూప్ 3 పరీక్షలను పకడిబందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం ఎస్పీ డీవీ. శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, కాగజ్‌నగర్ అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వరరావు, పరీక్షల రీజనల్ కో-ఆర్డినేటర్ లక్ష్మీనరసింహలతో కలిసి చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖ అధికారులు, పరిశీలకులు, రూట్ అధికారులు, ఐడెంటిఫికేషన్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్ 3 పరీక్షకు జిల్లాలోని ఆసిఫాబాద్‌లో 9, కాగజ్ నగర్‌లో 9 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 17వ తేదీన 2 సెషన్లు, 18న ఒక సెషన్ ఉంటాయని, పరీక్ష కేంద్రాలలో ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్‌లకు అనుమతి ఉండదని, అభ్యర్థులు పరీక్ష సమయానికి ఒక గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. అభ్యర్థులను మొదటి పేపర్‌కు ఈ నెల 17వ తేదీన ఉదయం 8.30 గంటలకు పరీక్ష కేంద్రంలోనికి అనుమతించడం జరుగుతుందని, 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష ఉంటుందని, రెండవ పేపర్ మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం ఐదున్నర గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. ఉదయం పరీక్షకు 9.30 గంటలకు గేటు మూసివేయడం జరుగుతుందని, పరీక్ష సాగుతున్న సమయంలో ప్రతి అరగంటకు ఒకసారి షార్ట్ బెల్, పరీక్ష ముగిసే 5 నిమిషాల ముందు షార్ట్ బెల్, పరీక్ష ముగిసే సమయానికి లాంగ్ బెల్ మోగిస్తారన్నారు. ఎస్పీ డీవీ.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సహాయ రీజియన్ కో-ఆర్డినేటర్ రాజేశ్వర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : పట్టణంలోని వసుంధర డిగ్రీ కళాశాల, వివేకానంద జూనియర్ కళాశాల, వివేకానంద డిగ్రీ కళాశాల, సుప్రభాత్ స్కూల్, ఎస్టీ క్లారిట్ స్కూల్, జవహర్ లాల్ నవోదయ విద్యాలయం, ఫాతిమా కాన్వెంట్ స్కూల్‌లలో నిర్వహించిన గ్రూప్ 3 పరీక్ష కేంద్రాలను కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా పరిశీలించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్ పాల్గొన్నారు.

బెజ్జూరులో శ్రీరంగదామేశ్వరి శతకం ఆవిష్కరణ




నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలో గురువారం రంగనాయక దేవాలయ ప్రాంగణంలో రంగధామేశ్వరి శతకం పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. బెజ్జూరు గ్రామానికి చెందిన వేలేశ్వరం మాధవాచారి రచించిన రంగధామేశ్వరి పుస్తకాన్ని మాధవాచారి భార్య ఏలేశ్వరం పద్మ కుటుంబ సభ్యులు, సాహితీవేత్తలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో అవధాని మాడుగుల నారాయణమూర్తి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే కవిలు మెచ్చిన కవి ఏలేశ్వరం మాధవాచారిని అవి వర్ణించారు. బెజ్జూరు నుండి బెంగళూరు వరకు మాధవచార్య రచించిన కవితలు వెళ్లాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కవుల సంఘం అధ్యక్షులు నల్లగొండ రమేష్, తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీఓ గౌరీ శంకర్, ఎంఈఓ సునీత, బెజ్జూర్ మాజీ సర్పంచ్ కొంద్ర జగ్గా గౌడ్, కవులు లక్ష్మణా స్వామి, మురళీధర్ గౌడ్ వెంకటేశ్వర్ గౌడ్, మంచర్ల రాజేందర్, బెజ్జూర్ రంగనాయక ఆలయ కమిటీ అధ్యక్షులు మహేష్, కంకాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు సులువ కనకయ్య, మాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పురుషోత్తం, ఏలేశ్వరం కుటుంబ సభ్యులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్



మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల జీడిచెనులో గురిజాల కార్తీక్ యాదవ్ జన్మదినం సందర్భంగా పాఠశాలలోని 30 మంది విద్యార్థులకు ప్లేట్స్, గ్లాసులను పంపిణీ చేశారు. పుట్టిన రోజు సందర్భంగా సేవ కార్యక్రమాలు నిర్వహించడంపై పలువురు అభినందించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కర్ల మానస, ప్రధానోపాధ్యాయులు పుల్లూరి బాలకృష్ణ ,ఉపాధ్యాయురాలు లావణ్య, మధ్యాహ్న భోజన కార్మికులు పుష్పలత, కళావతి, సాయి చరణ్, విజయ్, హరీష్, రాకేష్ పాల్గొన్నారు.

ప్రశ్నించడం సరే..చర్యలేవి?

నవతెలంగాణ-దహెగాం

దహెగాం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నాసిరకమైన భోజనం విద్యార్థులకు పెడుతున్నారని అడిషనల్ కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారని కానీ వారిపై చర్యలు తీసుకోలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వసాకె సాయికుమార్, చాపిలె సాయిక్రిష్ణలు ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలలో తరచుగా విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అవుతుందని, గతంలో జిల్లాలోని కస్తూర్బా వసతి గృహాలలో కూడా ఫుడ్ పాయిజన్ అయిందన్నారు. నాసిరకమైన భోజనం వడ్డిస్తున్నారని తెలిసినా కూడా వారిపై చర్యలు తీసుకోకుండా ఉండటం ఏంటని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండాలంటే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బ్యాంకర్లు వార్షిక రుణ లక్ష్యాలను సాధించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

2024-25 ఆర్థిక సంవత్సరం వార్షిక లక్ష్యాలను సాధించే దిశగా బ్యాంకర్లు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ సమన్వయకర్త సుర్జిత్ కార్తికేయన్, ఎస్ఎల్ బీసీ కన్వీనర్ శ్రీహరిలతో కలిసి ద్వితీయ త్రైమాసిక సమావేశానికి హాజరై బ్యాంకు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజీలు 100 శాతం పూర్తి చేసే విధంగా బ్యాంకర్లు, సెర్ప్ అధికారులు కృషి చేయాలని తెలిపారు. ప్రతి బ్యాంకు శాఖలు 4 నాలుగు గ్రామాలను దత్తత తీసుకోవాలని, ఆయా గ్రామాలలో ఆర్థిక అక్షరాస్యత కల్పనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రైతులకు పంట రుణాల లక్ష్యం రూ.వేయ్యి 621 కోట్లు కాక ఇప్పటి వరకు రూ.929 కోట్లు అందించడం జరిగిందని, మిగిలిన లక్ష్యాన్ని ఆర్థిక సంవత్సరంలోగా పూర్తి చేయాలని తెలిపారు. నాబార్డు క్రింద రైతులకు డైరీ ఫామ్‌లు, చేపల పెంపకం ఇతర ప్రత్యామ్నాయ ఆదాయం వైపు ఆకర్షించేలా అధికారులు కృషి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నందున అర్హులైన లబ్ధిదారులకు ఆయా పథకాల ఫలాలు అందే విధంగా జిల్లాలో అమలుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ, టీజీబీ రీజియన్ అధికారులు, ఎల్‌డీఎం రాజేశ్వర్ జోషి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్, బ్యాంకు మేనేజర్లు, సెర్ప్, మెప్మా అధికారులు, డీడీఎంలు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

పుస్తక పఠనాన్ని విద్యార్థి దశ నుండి అలవాటు చేసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ శాఖ భవనంలో ఏర్పాటు చేసిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించే భాండాగారాలన్నారు. ఈ నెల 20వ వరకు జిల్లాలో జరగనున్న గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. గ్రంథాలయాలు జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని అందిస్తాయని, గ్రంథాలయాలలో సమకూర్చిన అనేక గ్రంథాలు, పుస్తక సామాగ్రి ఎంతో మంది పాఠకులు, పోటీ పరీక్షల అభ్యర్థులకు దోహదపడుతున్నాయన్నారు. గ్రంథాలయాలలో ఎన్నో ప్రాచీన చరిత్రకు సంబంధించిన గ్రంథాలుంటాయని, భవిష్యత్తు తరాలకు మన చరిత్ర తెలుస్తుందన్నారు మన లక్ష్యాన్ని సాధించడంలో గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. పాఠకులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సరిత, సిబ్బంది సదానందం సతీదేవి, వెంకటరమణ, రాములు, సలీం, పాఠకులు పాల్గొన్నారు.

సింగరేణి సంస్థ మనుగడకు నాణ్యత ప్రధానం

- బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్

నవతెలంగాణ-రెబ్బెన

వినియోగదారులకు అందించే వస్తు నాణ్యత ఉత్పత్తి సంస్థ మనుగడను నిర్దేసిస్తుందని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. గురువారం ప్రపంచ నాణ్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని బెల్లంపల్లి ఏరియా లోని ఖైరిగూడ ఓసీ, సీహెచ్‌పీ వద్ద నాణ్యత వారోత్సవాల ప్రారంభోత్సవాలు నిర్వహించారు. గోలేటి జీఎం కార్యాలయం ఆవరణలో బొగ్గు నాణ్యత వారోత్సవాలను జీఎం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. నాణ్యత పతాకాన్ని ఆవిష్కరించి సిబ్బందితో కలిసి నాణ్యత ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో బొగ్గు నాణ్యత ఉత్పత్తి సంస్థ మనుగడను నిర్దేశిస్తుందన్నారు. నాణ్యత లేని బొగ్గును వినియోగదారులకు అందించడం వల్ల సంస్థకు నష్టం వాటిల్లుతుందన్నారు. ఉద్యోగులు నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే నాణ్యమైన ఉత్పత్తులు వినియోగదారులకు అందించవచ్చున్నారు. నాణ్యమైన బొగ్గు విషయంలో సింగరేణి సంస్థకు దేశ వ్యాప్తంగా మంచి పేరుందన్నారు. సంస్థ లక్ష్యాలను సాధించే క్రమంలో నాణ్యమైన బొగ్గు వినియోగదారులకు అందించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఉత్పత్తి విషయంలోనే కాకుండా ప్రతి ఉద్యోగి పనిలో సైతం నాణ్యత, క్రమశిక్షణతో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు బయ్య మొగిలి, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహర, ఫైనాన్స్ మేనేజర్ ఎం.రవికుమార్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, క్యాలిటీ ఇన్‌చార్జి గుమాస రవి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి మెస్ ఛార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వసాకె సాయికుమార్, చాపిలె సాయిక్రిష్ణలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాల విద్యార్థులకు మెస్ ఛార్జీలను పెంచిందని, వసతిగృహాల విద్యార్థులు మధ్యాహ్న భోజనం పాఠశాలలోనే చేస్తున్నారని, వారికి మాత్రం మధ్యాహ్న భోజనం నిధులు పెంచలేదన్నారు. ఎండీఎంలో విద్యార్థులకు రూ9.95 మాత్రమే ఇస్తున్నారని, ఇవి సరిపోవని నిధులు పెంచాలన్నారు. ఇప్పటికే అరకొర నిధులతో విద్యార్థులకి నాసీరకమైన భోజనం పెడుతూ, విద్యార్థులు ఆస్పత్రుల పాలైన సంఘటనలు తరచూ చూస్తున్నామన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి సరిపడా నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సుంకరి సాయికృష్ణ, ప్రభుత్వ జూనియర్ కళాశాల యూనిట్ కమిటీ కార్యదర్శి రక్షిత, నాయకులు ఝాన్సీరాణి, అనూష, దీపక్, తేజస్విని, శ్రీ హర్షిత, కీర్తన, పూజ పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడుదాం



ఆసిఫాబాద్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బాలల హక్కులను సమిష్టిగా కాపాడుదామని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో మాజీ దేశ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని జిల్లా మహిళా, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలల దినోత్సవ వేడుకలకు జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్‌తో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యం చాలా అమూల్యమైనదని, బాలలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పట్ల గౌరవభావం అలవర్చాలని, సమాజంలో ఉన్నతంగా ఎదిగేలా ప్రోత్సహించాలన్నారు. నేటి బాలలే రేపటి భావిభారత పౌరులని, దేశ భవిష్యత్తని, బాలల సంక్షేమం, సంరక్షణకు అందరం సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. ఈ సందర్భంగా బాలలు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని అలరించాయి. అనంతరం ఈనెల 8వ నుండి 14వ వరకు వివిధ పాఠశాలలను నిర్వహించిన పోటీలలో గెలుపొందిన బాలబాలికలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేష్, ఆసిఫాబాద్ సీడీపీఓ సాదియా రుక్సానా, బాల రక్షక్ భవన్ సిబ్బంది, సఖి సిబ్బంది పాల్గొన్నారు.

కౌటాల : నేటి బాలలే రేపటి పౌరులని ఎంఈఓ గావుడె హనుమంతు అన్నారు. గురువారం మండలంలోని పార్డి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన క్రీడల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆయన వెంట సీఆర్పీ గందం ప్రకాష్ ఉన్నారు.



కౌటాల



పెంచికల్‌పేట్

పెంచికల్‌పేట్ : బాలల దినోత్సవం సందర్భంగా చెడ్వాయి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులతో నిర్వహించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన పాఠశాల సమావేశంలో జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.రమేష్ బాబు ఉపాధ్యాయులతో కలిసి పూలమాలలు వేశారు. స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాకేష్, సంతోష్ కుమార్, చాంద్ పాషా, రాజ కమలాకర్ రెడ్డి, శిల్ప, సునీత, స్వప్న, అబ్దుల్ పాల్గొన్నారు.

వాంకిడి : మండలంలోని అన్ని పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెజ్జూరు : భారత మొదటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ దినోత్సవ సందర్భంగా గురువారం మండలంలోని ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల్లో బాలల దినోత్సవం జరుపుకున్నారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే విద్యాలయంలో స్వయంపాలన దినోత్సవం జరుపుకొని విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. అనంతరం పాఠశాలలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

కెరమెరి : విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాల్లో సృజనాత్మకతను అలవర్చుకోవాలని మండల విద్యాధికారి ఆడే ప్రకాష్ అన్నారు. గురువారం హట్టి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురష్కరించుకొని బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులచే ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ముఖ్య అతిథిగా హాజరై తిలకించారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పంచపుల, ఉపాధ్యాయులు గన్ను, సీఆర్టీలు పాల్గొన్నారు.

వాంకిడి సంఘటనలో హెచ్‌ఎం సస్పెన్షన్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారంతో విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనపై విచారణకు ఆదేశించిన ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా విధులపట్ల నిర్లక్ష్యం వహించారంటూ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటు విధించారు. మంగళవారం ప్రిన్సిపాల్‌తో పాటు మరో ముగ్గురిని బదిలీ చేసినట్లు ఉత్తర్వులు విడుదల చేసిన అధికారులు ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తూ ప్రత్యేక ఉత్తర్వులను గురువారం విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇదే సంఘటనపై ప్రజాసంఘాల నాయకులు చేసిన డిమాండ్‌కు అధికారులు స్పందించి సదరు ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు నాయకులు సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు.

నిజాయితీని నిరూపించుకున్న విలేకరి

నవతెలంగాణ-కౌటాల

ఏది దొరికినా ఎవరికి చెప్పకుండా ఉంచుకునే ఈ రోజుల్లో ప్రైమ్ నైన్ న్యూస్ విలేకరి దంద్రె విలాస్ నిజాయితీని నిరూపించుకున్నారు. ముత్తంపేట్ గ్రామానికి చెందిన డోంగ్రీ కళ్యాణ్ పొలం పనులు చేసుకొని వస్తున్న క్రమంలో అతనికి సంబంధించిన రూ.18 వేల విలువ గల రియల్ మి మొబైల్ గ్రామ సమీపంలో గల పల్లె ప్రకృతి వనం వద్ద ప్రైమ్ 9 న్యూస్ రిపోర్టర్ విలాస్‌కు దొరికింది. ఆ మొబైల్‌ను ఎస్సై మధుకర్‌ను అందించి బాధితుడికి ఇప్పించారు. దీంతో విలేకరి నిజాయితీకి ఎస్సై అభినందించారు.

మార్పుల కారణంగా మధుమేహం పెరుగుతోంది



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆధునిక కాలంలో చోటు చేసుకున్న మార్పుల వల్ల సమాజంలో డయాబెటిస్ పేషంట్స్ రోజు రోజుకు పెరిగిపోతున్నరనిడాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం ప్రపంచ మధుమేహ దినం సందర్భంగా ఉచిత వ్యాధి నివారణ పరీక్షలను పట్టణంలోని కిమ్స్ హాస్పిటల్‌లో నిర్వంచారు. ఇంతకు ముందు ఎక్కువగా డయాబెటిస్ అనేది వయస్సు పైబడినవారిలో వచ్చేదని, ప్రస్తుత సమయాల్లో చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ఎంతో మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారని శ్రీనివాస్ తెలిపారు. గురువారం నుంచి ఈనెల 30 వరకు ప్రతి రోజు ఉదయం 8 నుండి 11 గంటల వరకు కిమ్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి పట్ల అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు చంద్రకుమార్, రామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని కాగజ్‌నగర్ ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ సురేష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సహకార సంఘ భవనం ఆవరణలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జెండా ఆవిష్కరించినంతరం ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల అభివృద్ధితో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రుకుం ప్రహ్లాద్, డైరెక్టర్లు జైనేని దేవన్న, దుర్గం ధావు, నారా ఆశన్న, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలువేరు వెంకన్న, ఏడీసీసీ బ్యాంక్ ఆసిఫాబాద్ మేనేజర్ అనిల్, సూపర్‌వైజర్ రాజేందర్, అసిస్టెంట్ మేనేజర్ ఇమ్రాన్, క్యాషియర్ నరేశ్, మధుకర్, సీఈఓ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాధికారంతో బహుజనుల అభివృద్ధి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాజ్యాధికారంతోనే బహుజనుల అభివృద్ధి సాధ్యమవుతుందని దీనికోసం అందరం ఏకం కావాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశంలో బహుజనులైన ఎస్సీ, ఎస్టీ, బీసీల జనాభా ఎక్కువగా ఉన్న అగ్రవర్ణ పార్టీల వారే పాలిస్తున్నారన్నారు. ఇప్పటికైనా బహుజనులందరూ ఏకమై వారివారి రిజర్వేషన్ల ప్రకారం వారి హక్కులను కల్పించుకుంటూ బహుజన రాజ్యాధికారం కోసం పాటుపడాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బహుజన పార్టీ తరపున అభ్యర్థులు బరిలో ఉంటారన్నారు. బహుజన సమాజ్ పార్టీ బలోపేతం కోసం నూతన జిల్లా అధ్యక్షునిగా భూఖ్య రాజును నియమించగా జిల్లా ఉపాధ్యక్షుడిగా ముదసిర్ హుస్సేన్, రాష్ట్ర ఈసీ సభ్యులుగా మహమ్మద్ సిరాజ్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎనగందుల వెంకన్న, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణ, భద్రత పోలీస్ బాధ్యత

నవతెలంగాణ-తాండూర్



శాంతి భద్రతల పరిరక్షణ పోలీసుల కర్తవ్యమని బెల్లంపల్లి రూరల్ సర్కిల్ సీఐ అఫ్జలోద్దీన్ అన్నారు. గురువారం బెల్లంపల్లి 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీ నగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా తనిఖీలు నిర్వహించారు. ధ్రువపత్రాలు లేని 24 ద్విచక్ర వాహనాలు, 3 ఆటో సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణ పోలీసుల బాధ్యతని, బాధ్యతగల పౌరులు పోలీసులకు సహకరించాలన్నారు. కాలనీలో కొత్త వ్యక్తులు, నేరస్తులు, షెల్టర్ తీసుకుని ఉంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి 2 టౌన్, తాళ్ళగురిజాల, నెన్నెల ఎస్సైలు మహేందర్, రమేష్, ప్రసాద్, సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్ననాటి మిత్రుడికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని రెబ్బనపల్లి గ్రామానికి చెందిన కట్ట సుధాకర్ అనే వ్యక్తి క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతున్నాడు. ఆయనతో పాటు రెబ్బనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2006-07 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు తోటి స్నేహితునికి బాసటగా నిలిచారు. ఈ సందర్భంగా సుధాకర్ ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.26వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆపద సమయంలో కూడా స్నేహితులు ఉన్నారంటూ వారు గుర్తు చేశారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి



నవతెలంగాణ-నస్పూర్

ప్రతి సంవత్సరం లాగానే వచ్చే ఏడాది కూడా నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని జనరల్ మేనేజర్ కార్పొరేట్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్, కార్పొరేట్ టార్గెట్ కమిటీ కన్వీనర్ మనోహర్ అన్నారు. గురువారం సింగరేణి గెస్ట్ హౌస్‌లో ఇన్‌చార్జి జీఎం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మనోహర్‌తో కమిటీ సభ్యులు హాజరయ్యారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి శ్రీరాంపూర్ ఏరియా గనుల ఉత్పత్తి లక్ష్యాల నిర్ణయం కోసం టార్గెట్ కమిటీ పర్యటన ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 2025 నుండి మార్చి 2026 వరకు శ్రీరాంపూర్‌లోని వివిధ గనులు సాదించాల్సిన బొగ్గు ఉత్పత్తి, ఓబీ తొలగింపు లక్ష్యాలను కార్పొరేట్ టార్గెట్ కమిటీ నిర్ణయిస్తుంది. ఈ సందర్భంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను, బొగ్గు నాణ్యతను ఉత్పత్తి సాదించేందుకు అవసరమయ్యే యంత్రాలు, పని స్థలాలు, పరికరాలు, కావాల్సిన స్పేర్ పార్ట్ గురించి కూడా కమిటీ సభ్యులు చర్చించారు. ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో ఉన్న భూగర్భ, ఉపరితల గనులు ఉత్పత్తి లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధిస్తాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ సాయి బాబు, జనరల్ మేనేజర్ ఉపరితల గనులు సూర్యనారాయణ రాజు, జనరల్ మేనేజర్ భూగర్భగనులు రఘురాం రెడ్డి, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఇందారం ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏవీ రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా ఏజెంట్లు కుర్మ రాజేందర్, వెంకటేశ్వర రావు, గనుల మేనేజర్లు, ప్రాజెక్ట్ ఇంజనీర్లు, గ్రూపు గనుల ఇంజనీర్లు పాల్గొన్నారు.

భూగర్భ గనుల నష్టాలు పవర్‌ప్లాంట్ లాభాలతో భర్తీ

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి వ్యాప్తంగా ఉన్న భూగర్భ బొగ్గు బావులతో ఏర్పడుతున్న నష్టాలను జైపూర్ సింగరేణి విద్యుత్ థర్మల్ ప్లాంట్ లాభాలతో భర్తీ చేస్తున్నామని ప్లాంట్ హెచ్ఎంఎస్ ఉపాధ్యాక్షులు సాయికృష్ణా రెడ్డి అన్నారు. ప్లాంట్ లాభాల కోసం రాత్రింబవళ్లు కష్టపడుతున్న కార్మికుల నోట్లో మట్టి కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాలు నుండి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మికుల పట్ల సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఎస్టీపీపీ ఏర్పాటుకు భూములు సమకూర్చిన నిర్వాసితులు, ప్లాంట్ లాభాల కోసం అహర్నిషలు కష్టపడుతున్న కాంట్రాక్టు కార్మికులను సింగరేణి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఎన్టీపీసీలో అములు చేస్తున్నట్లుగా అలవెన్స్‌లు అమలు చేయాలని కొంత కాలంగా డిమాండ్ చేస్తున్నామని, సింగరేణి యాజమాన్యం హెచ్ఎంఎస్ నాయకులతో కలిసి 20 రోజుల్లో కాంట్రాక్టు కార్మికుల సమస్యలను చర్చించి పరిష్కరించుకోవాలని డిప్యూటీ చీఫ్ లేబర్ కమీషనర్ శ్రీనివాసులు సెప్టెంబర్ 21న ఆదేశించిన తీరు పట్ల కనీస స్పందన లేకుండా పోయిందన్నారు. హెచ్ఎంఎస్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రభావిత గ్రామాల వారితో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి సింగరేణి మొండి వైఖరికి వ్యతిరేకంగా సమ్మె చేపట్టడానికి యూనియన్ సిద్ధమవుతుందని తెలిపారు.

ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-తాండూర్

వికారాబాద్ జిల్లాలో కలెక్టర్, రెవెన్యూ ఉద్యోగులపై జరిగిన దాడికి నిరసనగా మండల కార్యాలయ ఆవరణలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో రెవెన్యూ ఉద్యోగులపై జరిగిన దాడిని సమస్త తెలంగాణా ఉద్యోగ సమాజంపై జరిగిన దాడిగా తెలంగాణా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ భావిస్తోందని తెలిపారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో తెలంగాణా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ అధ్వర్యంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన పట్టినట్లు తెలిపారు.

యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ
- అట్టహాసంగా ముగిసిన జోనల్ స్థాయి క్రీడా పోటీలు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. గురువారం పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో కాలేశ్వరం జోనల్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ బహుమతి ప్రధానోత్సవానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని గెలుపే లక్ష్యంగా కష్టపడి ఆడినప్పుడే గెలుపు సాధ్యమౌతుందన్నారు. 4 రోజులపాటు జోనల్ లెవెల్ క్రీడా పోటీలు పెద్ద ఎత్తున నిర్వహించిన కళాశాల సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు. కళాశాలలో ఇబ్బందులను ఎంపీ నిధులతో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఇలాంటి క్రీడా పోటీలను నిర్వహించడం వల్ల క్రీడాకారులను ప్రోత్సహించినట్లు ఉంటుందని, క్రీడల వల్ల జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మన ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చే అవకాశం ఉందన్న విషయాన్ని ప్రతి క్రీడాకారుడు గమనించాలని సూచించారు. అంతకు ముందు కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఏ పని చేసిన కష్టపడి చేస్తే విజయం తప్పకుండా వరిస్తుందన్నారు. క్రీడాకారులు గెలుపు ఓటమిలను సహజంగా తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తితో ఆడి విజయం సాధించాలన్నారు. అనంతరం గెలుపొందిన జట్లకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమా కల్యాణి, వైస్ ప్రిన్సిపల్ కె.మహేశ్వరరావు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బొగ్గు నాణ్యత వారోత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-మందమర్రి



బొగ్గు నాణ్యత వారోత్సవాలను ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ విజయ్ ప్రసాద్ గురువారం జీఎం కార్యాలయంలో జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ నుండి 20 వరకు బొగ్గు వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బలరాం సారధ్యంలో దక్షిణ భారత దేశంలోనే అగ్రగామి బొగ్గు ఉత్పత్తి సంస్థగా సింగరేణి దేశంలోని వివిధ సంస్థలకు విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు 134 సంవత్సరాలుగా బొగ్గు సరఫరా చేస్తూ దేశ ఆర్థిక ప్రగతి లో సుస్థిర స్థానం సంపాదించుకున్నదని తెలిపారు. కానీ ప్రస్తుత పోటీ మార్కెట్‌లో ఇతర బొగ్గు సంస్థలకు ధీటుగా సింగరేణి సంస్థ కూడా బొగ్గు నాణ్యత ప్రమాణాలను మరింతగా పెంచుకోవాల్సిన అవసరముందన్నారు. ఏ సంస్థకైనా దాని మనుగడ పురోభివృద్ధి ఆ సంస్థ ఉత్పత్తి ఉత్పాదకతలతో పాటు ఉత్పత్తి అయిన వస్తు నాణ్యతపై ఆధారపడి ఉంటుందన్నారు. విద్యుత్ రంగంలో సంభవించిన మార్పుల ఫలితంగా భారతదేశం అంతటా ఒకే పంపిణీ వ్యవస్థ కిందకు రావడం జరిగిందన్నారు. తక్కువ ధరకు విద్యుత్ ఉత్పత్తి చేసే సంస్థలకే ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని కావున సింగరేణి నుంచి బొగ్గును సమకూర్చుకునే విద్యుత్ సంస్థల నుండి తీవ్రమైన పోటీని ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేయడం మన కర్తవ్యంగా భావించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మందమర్రి ఏరియ బ్రాంచ్ సెక్రటరి సలేంద్ర సత్యనారాయణ, క్వాలిటీ ఇన్‌చార్జి ఆఫీసర్ వెంకటరెడ్డి, ఏఐటీయూసీ జీఎం కార్యాలయ పిట్ సెక్రటరీ సాంబశివరెడ్డి, డీవైపీఎం ఎండీ ఆసిఫ్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయించినా, సేవించినా చర్యలు



నవతెలంగాణ-జైపూర్

గంజాయి విక్రయించినా, సేవించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండలంలోని నర్వ గ్రామ శివారులో గంజాయి అమ్ముతున్న వారిని గురువారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్వ శివారులో గంజాయి అమ్ముతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు చేసి నలుగురిని పట్టుకున్నారు. నెన్నెల మండలం ఘన్‌పూర్‌కు చెందిన పోతురాజుల ఆకాష్, జైపూర్ మండలం నర్వ గ్రామానికి చెందిన దూట రాజకుమార్, జైపూర్ మండల కేంద్రానికి చెందిన షేక్ ఆఫ్రీది, పెగడపల్లి గ్రామానికి చెందిన తోట ప్రశాంత్ ఉన్నట్లు తెలిపారు. విచారించగా భద్రాది కొత్తగూడెం జిల్లా సీలేరు గ్రామానికి చెందిన గుర్తు తెలియని వక్తి నుండి గంజాయి తీసుకువచ్చి జైపూర్ మండలం చుట్టుపక్కన గల గ్రామాలలో అవసరమైన వారికి అధిక ధరలతో అమ్ముతున్నట్లు తెలిపారని వెల్లడించారు. పట్టుబడిన ఈ నలుగురి నుండి కిలో 380 గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, జైపూర్ ఎస్సై శ్రీధర్ పాల్గొన్నారు.

వరి విత్తనాలలో మోసం

- దిగుబడి తగ్గి లబోదిబోమంటున్నరైతులు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని కొత్తపేట, హాస్టల్ తండా గ్రామాలకు చెందిన 40 మంది రైతులు గత వర్షాకాలం సీజన్‌లో మండలంలోని వివిధ ఫర్టిలైజర్ షాపుల్లో నూజివీడు వరి సీడ్స్ కొని వేసుకున్నారు. కానీ పంట కోసే దశలో దిగుబడి తక్కువగా రావడంతో ఆ వరి సీడ్స్ అమ్మిన షాపులపై చర్యలు తీసుకోవాలని ఆ రైతులు వ్యవసాయ శాఖ అధికారులను కోరుతున్నారు. కొత్తపేట గ్రామానికి చెందిన పవర్ దినేష్ కుమార్ రైతు మండల కేంద్రంలోని శ్రీనివాస ఫర్టిలైజర్ షాపులో నూజివీడు వరి విత్తనాలు కొని తన పొలంలో వేసుకున్నాడు. పంట దిగుబడి రాకపోవడంతో వ్యవసాయ శాఖ అధికారులను కలిసి తన గోడును విన్నవించుకున్నాడు. తనకు విత్తనాలు అమ్మిన ఫర్టిలైజర్ షాప్ యజమానిపై చర్యలు తీసుకొని నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే కొత్తపేట హాస్టల్ తండా గ్రామాల్లో దాదాపు 40 మంది రైతులు ఇదే విత్తనాలను దాదాపు 100 ఎకరాల్లో వేసుకొని నష్టపోయామని వాపోతున్నారు. ఇదే గ్రామంలో చందు అనే రైతు తన మూడున్నర ఎకరాల పొలంలో నూజివీడు అనే వరి రకం వేసుకోవడంతో ఎకరానికి వరి కోత మిషన్ డబ్బాతో నాలుగు డబ్బాలు రావాల్సిన వడ్లు మొత్తం మూడున్నర ఎకరాల పొలంలో మూడున్నర డబ్బాలే రావడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నాడు. వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి ఆ ఫెర్టిలైజర్ షాపులపై చర్యలు తీసుకొని నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.

మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై కేసు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ పాత అంగడి బజార్‌కు చెందిన ఒక మహిళ పట్ల అసభ్యకరంగా వ్యవహరించిన షేక్ గౌస్, షేక్ షబ్బీర్‌పై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ పున్నం చంద్ తెలిపారు. బాధిత మహిళ అన్న, మేన మామ మధ్య జరిగిన గొడవ విషయంలో బాధితురాలికి వరుసకు మామయ్య షేక్ గౌస్ ఫోన్ చేసి మాట్లాడారని పీరీల బంగ్లా దగ్గరికి రమ్మని చెప్పగా బాధితురాలు వెళ్లడంతో షేక్ గౌస్‌తో పాటు అతని వరుసకు తమ్ముడు షేక్ షబ్బీర్ అసభ్యకరంగా ప్రవర్తించారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్టు తెలిపారు.

విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించాలి

నవతెలంగాణ-తాండూర్

ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల్లో చదవడం అలవాటు చేయడం ద్వారా వారిలో పఠణశక్తి పెంపొందించవచ్చునని ఎంఈఓ మల్లేశం తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీపీఎస్‌లో రూమ్ టు రీడ్ ఇండియా వారు ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూమ్ టు రీడ్ ఇండియా వారు ఏర్పాటు చేసిన ఈ మోడల్ లైబ్రరీలో వివిధ రకాల రంగురంగుల కథల పుస్తకాలు, పఠన సామాగ్రి ద్వారా విద్యార్థుల్లో విద్య సామర్థ్యాలు పెంపొందించవచ్చునని తెలిపారు. ఈ గ్రంథాలయాల ద్వారా విద్యార్థుల్లో అర్థవంతమైన పఠన సామర్థ్యాలు పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో రూమ్ టు రీడ్ డిస్ట్రిక్ లీడ్ మధు, ఎల్ఎఫ్ రేణుక, తాండూర్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం మల్లేశం, లలిత, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుకు మేలుకే సహకార వ్యవస్థలు



నవతెలంగాణ-జన్నారం

రైతులకు మేలు చేయడానికి పీఏసీఎస్ సహకార వ్యవస్థ పని చేస్తుందని పోన్కల్ పీఏసీఎస్ ఛైర్మన్ అల్లం రవి అన్నారు. సహకార వారోత్సవాలలో భాగంగా గురువారం పోన్కల్ పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో సహకార జెండాను ఎగురవేశారు. రైతులకు కావాల్సిన ఎరువులు, రుణాలను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ మహిపాల్ రెడ్డి, సీఈఓ కావేటి సమ్మయ్య పాలక మండలి డైరెక్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

నవతెలంగాణ-తాండూర్

విద్యార్థుల ఆహారం నియమాలు, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తాండూర్ స్పెషల్ ఆఫీసర్ అంజయ్య తెలిపారు. గురువారం మండలంలోని మహాత్మా జ్యోతి పూలే, కస్తూర్బా పాఠశాలలను సందర్శించి వసతి సౌకర్యాలను పరిశీలించారు. భోజన, వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కాలం చెల్లిన మందులను ఒకనెల ముందస్తుగానే గుర్తించి వాటిని వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వంటశాల, వంట పాత్రను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఎస్సీ బాలుర వసతి గృహం సందర్శించినంతరం తాండూర్ గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఇంటింటి కుటుంబ సర్వేని పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలనీ ఎన్యుమరేటర్లకు సూచించారు. ఆయన వెంట జి.అనిల్ కుమార్, ప్రిన్సిపాల్ కవిత, వినోద్ కుమార్, సూపర్‌వైజర్ నంద కుమార్, పంచాయతీ కార్యదర్శులు డి.దివాకర్, ఎం.ఉదయ్ రామ్ ప్రసాద్ ఉన్నారు.



జిల్లా వ్యాప్తంగా ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



దండేపల్లి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని వివిధ ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల్లో జవహర్‌లాల్ నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కలమడుగు ప్రభుత్వ పాఠశాలలో మంచిర్యాల డీఈఓ యాదయ్య ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కట్ట రాజమౌళి, ఎంఈఓ విజయ్ కుమార్ పాల్గొన్నారు. కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలలో బాలల దినోత్సవంలో పాఠశాల హెచ్ఎం సుధాకర్ ఉపాధ్యాయులు రామ టింకి శ్రీనివాస్ పాల్గొన్నారు. వివేకానంద పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు వలే బోధించారు. కార్యక్రమానికి ఇందన్‌పల్లి రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బహుమతులిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీశ్ గౌడ్, సేక్షన్ అధికారి రవి, బీట్ అధికారి ముజీబొద్దీన్, ఇన్‌చార్జి తిరుపతి గౌడ్ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : పట్టణంలోని సీఎస్ఐ రైడల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎస్. డేవిడ్ పాల్ బాలల దినోత్సవం, జవహర్ లాల్ నెహ్రూ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులందరూ ఉత్సాహంతో చేసిన నృత్యాలు, వివిధ రకాల వేషధారణలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దండేపల్లి : భారత దేశ తొలి ప్రధాని పిల్లలకు చాచా జవహర్‌లాల్ నెహ్రూ జయంతి బాలల దినోత్సవం పురష్కరించుకుని గురువారం మండలంలోని అన్ని పాఠశాలలో విద్యార్థులు ఘనంగా నిర్వహించాకున్నారు. వెల్గనూర్ ఉన్నత పాఠశాలలో ఒక్క రోజు పిల్లలే ఉపాధ్యాయులుగా మరి తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పలువురు విద్యార్థులు ప్రధానోపాధ్యాయులుగా, ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.

కాసిపేట : మండలంలోని ధర్మారావుపేట ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం, పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను పురస్కరించుకొని ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. 50కి పైగా విద్యార్థులు వివిధ వంటకాలను తయారు చేసుకొని పాఠశాలలో మేళా నిర్వహించారు. ఫుడ్ ఫెస్టివల్‌లో పలువురు విద్యార్థులు గెలుపొందారు. తల్లిదండ్రులకు గేమ్స్ అండ్ స్పోర్ట్స్ నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులకు ఐడెంటిటీ కార్డులు, బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర్ నాయక్ పాల్గొన్నారు.



జైపూర్

ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు...

మండలంలోని దేవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవంతో పాటు స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. విద్యార్థులు చేసిన వివిధ రకాల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో హెచ్ఎం రాథోడ్ రమేష్, ఉపాధ్యాయులు సురేష్ బాబు, అంజాద్ పాషా, లచ్చన్న, రాజేష్, రమణయ్య, సులోచన, రాజేష్, కృష్ణ, రజిత పాల్గొన్నారు.

తాండూర్ : జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని గురువారం బెల్లంపల్లి కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బాలల దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా బెల్లంపల్లి ఎంఈఓ జే. పోచయ్య అలాగే పాఠశాల డైరెక్టర్ ఈ. రవి ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ యం. రాజ రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు ప్రదర్శిస్తూ కనువిందు చేశారు. అదే విధంగా తాండూర్ మండలం మాదారం పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో సంబరాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

జైపూర్ : బాలల దినోత్సవాన్ని గురువారం భీమారం పోలీస్ స్టేషన్‌లో బాలబాలికలతో కలిసి ఘనంగా జరుపుకున్నారు. దేశ తొలి ప్రధాని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 14న బాలల దినోత్సవాన్ని జరుపుకుంటామని ఎస్సై శ్వేత తెలిపారు.



తాండూర్



కాసిపేట

విద్యార్థులకు ప్యాడ్లు అందజేత

నవతెలంగాణ-ఉట్నూర్



మండలంలోని నవోదయ నగర్ టీడబ్ల్యూపీఎస్ పాఠశాలల్లో విద్యార్థులకు శ్రీసేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్యాడ్లు అందజేశారు. గురువారం శ్రీసేవా ఫౌండేషన్ అధ్యక్షులు జాదవ్ వసంతరావు మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం సందర్భంగా శ్రీసేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తమ వంతుగా ప్యాడ్‌లు అందజేశామన్నారు. విద్యార్థులు చాచా నెహ్రూ అడుగుజాడలో ముందుకు కొనసాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సేవా ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి చవాన్ సేవాదాస్, సభ్యులు బానోత్ రవీందర్, పాఠశాల హెడ్‌మాస్టర్ గంగాసాగర్, అంగన్‌వాడీ టీచర్, ఆయాలు పాల్గొన్నారు.

ఘనంగా సహకార సంఘం వారోత్సవాలు

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మెన్ మేకల వెంకన్న జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు సహకార సంఘాన్ని ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చట్ల వినీల్, సొసైటీ పాలక వర్గం సభ్యులు సెక్రటరీ నారాయణగౌడ్, సొసైటీ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



క్రీడలతో పాటు చదువులో రాణించాలి



నవతెలంగాణ-ముథోల్

చదువుతో పాటు విద్యార్థులు క్రీడా రంగాల్లోనూ రాణించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న జోనల్ స్థాయి, క్రీడా పోటీల ముగింపు ఉత్సవాలలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని అన్నారు. నవంబర్ 14, బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులందరికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి విద్యార్థి క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వంటి తమకు ఇష్టమైన ఆటలు ఆడాలని, క్రీడలు శారీరకంగా, మానసికంగా ఎదిగేందుకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని అన్నారు. భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకుని అందుకు కష్టపడి చదవాలని తల్లిదండ్రులకు, కళాశాలకు గుర్తింపు తీసుకురావాలని కోరారు. అనంతరం జోనల్ స్థాయి క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతలకు కలెక్టర్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సీఎచ్ నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ అనంద్‌రావు పటేల్, ఆర్డీఓ కోమల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్, అధికారులు, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటిగుంతలో ఆటో పడి మహిళ మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

కూలీ పనులకు ఆటోలో వెళుతున్న క్రమంలో ఆటో అదుపు తప్పి పక్కనే ఉన్న నీటి గుంతలో పడటంతో మహిళ మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని బంగారుగూడ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్సై ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం...బంగారుగూడకు చెందిన మోరె సవిత(35) కూలీ పనుల నిమిత్తం ఆటోలో వెళ్తున్న క్రమంలో డంపింగ్‌యార్డు సమీపంలో ఆటో ముందరి టైర్ పగిలింది. దీంతో ఆటో అదుపు తప్పి పక్కనే ఉన్న మొరం తవ్వకాలు చేపట్టిన నీటిగుంతలో పడింది. ఈ ప్రమాదంలో సవిత మృతి చెందగా మరో ఐదుగురుకి గాయాలయ్యాయి. గాయాలైన వారు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. కాగా గల్లంతైన సవిత మృతదేహాన్ని ఈతగాళ్ల సహాయంతో బయటకు తీశారు. మృతురాలి భర్త మోరె దీపక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. మృతురాలుకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కౌలు రైతుల పక్షాన అసెంబ్లీలో ప్రస్తావించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కౌలు రైతులకు ఎల్‌ఈసీ కార్డులతో పాటు, విత్తనాలు కొనుక్కోవడానికి, పంట నష్టపోతే నష్టపరిహారం, వచ్చే విధంగా, తను పంటను అమ్ముకునే విధంగా, రైతులకి రైతు భరోసా నిధులిప్పించే విధంగా శీతకాల సమావేశంలో అసెంబ్లీలో ఈ అంశాన్ని ప్రస్థావించాలని, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న అన్నారు. గురువారం ఎమ్మెల్యే పాయల శంకర్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో 28,763 మంది కౌలు రైతులున్నారని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1లక్ష 17 వేలకు పైగా కౌలు రైతులు ఉన్నారని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత 13 సెప్టెంబర్ 2023 సంవత్సరంలో ఎన్నికల మేనిఫెస్టోలో ఆరు గ్యారంటీలలో భాగంగా కౌలు రైతులకు రైతు భరోసా నిధులు ఇస్తామని చెప్పడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ అయిపోయిందని, రబి సీజన్ ప్రారంభం అయినా ఇంతవరకు కూడా రైతు భరోసా ఇవ్వలేనటువంటి పరిస్థితి ఉందన్నారు. 2011లో కాంగ్రెస్ ప్రభుత్వమే కౌలు సాగుదారులను గుర్తించి, ఎల్‌ఈసీ కార్డులు ఇచ్చేటట్లు భూ ఆదికృత సాగుదారుల చట్టం తెచ్చి అమలు చేసిందన్నారు. గత ప్రభుత్వంలో ఈ కౌలు దారి చట్టం అమలు కాకపోవడంతో తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు కార్యక్రమంలో రైతులు రవి, సుభాష్, దత్తు, కిరణ్ ఉన్నారు.

మహాసభను విజయవంతం చేద్దాం

నవతెలంగాణ-ఇచ్చోడ

ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ కేంద్రంగా తుడుం దెబ్బ మహాసభ గోడ ప్రతులను తుడుం దెబ్బ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తుడుం దెబ్బ కన్వీనర్ కొడప నగేష్ మాట్లాడుతూ ఈ నెల 20న ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ కలిపి ఈనెల 20న ఉట్నూర్ లో మహా సభను నిర్వస్తున్నట్టు తెలిపారు. జిల్లా, డివిజన్, మండల కమిటీలతో పాటు తుడుం దెబ్బ అనుబంధ సంఘాలు ఆదివాసీ విద్యార్థి, ఆదివాసీ మహిళా, ఆదివాసీ నిరుద్యోగ, ఆదివాసీ రైతు, ఆదివాసీ యువజన సంఘాలు హాజరై విజయవంతం చేయాలని తుడుం దెబ్బ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కొడప నగేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ బాపురావు, మేడిగూడ రాయిసెంటర్ సార్మెడి కుమ్ర శంభు, తుడుం దెబ్బ బోథ్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆత్రం మహేందర్, భీంరావు, జుగ్నక్ గంగారాం పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-భైంసా

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. గురువారం మహారాష్ట్రలోని నాయగావ్ బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి రాజేష్ సంబాజీ పవార్ తరపున ప్రచార పర్వాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రతనెల్లి, బాలాపూర్, గ్రామాలతో పాటు ధర్మాబాద్, పట్టణంలో ప్రచారం చేశారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 400 హామీలతో గద్దెనెక్కి ప్రజలను మోసం చేశారన్నారు. రుణమాఫీ సక్రమంగా అమలు చేయకుండా, రైతులకు ముంచిన ఘనత కాంగ్రెస్ దేనన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15వేల పెట్టుబడి సాయం అందిస్తానని, మాటిచ్చి ఇప్పటికీ పెట్టుబడి సాయం ఇవ్వ లేదన్నారు. అబద్ధపు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్‌కు మహారాష్ట్రలో మరో మారు ఇంటికి సాగనంపాలన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ హయంలో దేశం అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తుందని, కమలం గుర్తుకు ఓటేసి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. అయన వెంట నియోజకవర్గం నుంచి పలువురు నాయకులు వెళ్లారు.

భూవివాదంలో ఐదుగురిపై కేసు నమోదు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన బండారు దేవుబాయి, బండారు హరీష్, బండారు కళ్యాణ్, బండారు రాజేశ్వర్, బండారు సాయి అనే ఐదు గురిపై భూవివాదంతో పాటు చంపుతానని బెదరించడంతో జైస్వాల్ శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేర కేసును నమోదు చేసినట్టు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు.

నెహ్రూ సేవలు మరువలేనివి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశ మొట్టమొదటి ప్రధానిగా పనిచేసిన మహనీయులు పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ సేవలను భారత జాతి ఎన్నడూ మరిచిపోలేదని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం నెహ్రు జయంతి, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డు వద్ద గల చాచా నెహ్రు విగ్రహానికి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని నవంబర్ 14న భారతదేశమంతటా బాలల దినోత్సవంగా జరుపుకుంటామని గుర్తు చేశారు. నేటి బాలలే రేపటి పౌరులని, గుర్తు చేసేదే బాలల దినోత్సవమని అన్నారు. పెద్దలు వారి పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు తమవంతు సహాయాన్ని అందించాలని అన్నారు. ప్రభుత్వం బాలల అభివృద్ధికి, విద్యార్థులకు అన్ని అవకాశాలు కల్పిస్తూ గురుకులాలు ఏర్పాటు చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, మాజీ వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కుదురుపాక సురేష్, మాజీ కోఆప్షన్ మెంబర్ రహీమ్‌ఖాన్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో...

పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ స్వాతంత్ర్యానంతరం దేశంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో తొలి ప్రధానిగా సేవలందించారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ అన్నారు. చాచా నెహ్రూ 132వ జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పట్టణంలోని నెహ్రూ చౌక్ మార్కెట్ యార్డ్ వద్ద గల జవహర్ లాల్ నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో తాలూకా పద్మశాలి సంఘం అధ్యక్షులు బొమ్మకంటి రమేష్, నాయకులు మొహమ్మద్ రఫీక్, బూర్ల శంకరయ్య, మంచాల మల్లయ్య, కొండూరి రవి, దాసరి ఆశన్న, భరత్ శ్రవణ్ నాయక్ ఉన్నారు.

ఇంద్రవెల్లి : నవంబర్ 14న మాజీ ప్రధాని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకుని జరిపే బాలల దినోత్సవం మండలంలోని సన్‌షైన్ పాఠశాలతో పాటు వివిధ పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. చాచా నెహ్రూ జీవిత చరిత్ర పై విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ సాడిగే రాజ గోపాల్, నర్సయ్య, రాహుల్, ఎండి షబ్బీర్, సంతోష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సిరికొండ : మండల కేంద్రంతో పాటు మండలంలోని పొన్న, సోంపల్లి, రాంపూర్‌గూడ, పోచంపల్లి, వాయిపేట్, రిమ్మ, రాయిగూడ తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి జవహర్‌లాల్ నెహ్రూ చేసినటువంటి సేవలను కొనియాడారు. ఆయన చూపిన బాటలో నడుచుకోవాలని పలువురు నాయకులు సూచించారు.

సారంగాపూర్ : మండల కేంద్రంలోని వింధ్య పాఠశాలలో గురువారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి విద్యను బోధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఏ.రమేష్ మాట్లాడారు. ఉపాధ్యాయ గొప్పతనాన్ని ఆవశ్యకతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే.నవీన్ కుమార్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీరాం శ్రీనివాస్, సాయినాథ్, భారతి, శ్రీలత, పల్లవి, సుమన్య, లక్ష్మీ లావణ్య, సౌజన్య, పూజ, సునీత, మంజుల, సులోచన, విద్యార్థులు పాల్గొన్నారు.

తలమడుగు : బాలల దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను గురువారం భరంపూర్‌లోని శ్రీవెంకటేశ్వర ఆలయానికి వెళ్లారు. ఆటపాటల మధ్య ఆనందంగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు వనభోజనాలు చేశారు. మానసిక ఉల్లాసానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రావ్, ఉపాధ్యాయులు చంద్రమ్మ, వెంకటేశ్వర్, వినోద్ రెడ్డి, మురళీధర్, రాకేష్, రవీంద్రకుమార్, రాజేందర్, అతవుల్లఖాన్, సుమలత, నర్సయ్య, స్వప్న, శ్రీనివాస్, సంతోష్, సౌందర్య పాల్గొన్నారు.

నేరడిగొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ పీఓ స్వామి మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు బాల్య జీవితాన్ని ఆనందంగా గడుపుతూ యుక్త వయస్సులో చెడు అలవాట్లకు లోను కాకుండా అందమైన జీవితాన్ని గడపాలని సూచించారు. అదేవిధంగా ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజార్షిషా ఆదేశానుసారం ప్రతి కళాశాలలో ఉదయం ప్రార్థన సమయంలో 15 నిమిషాలు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని అందులో భాగంగా ఆరోగ్య కళాశాల అనే పోస్టర్లను విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

నార్నూర్ : దేశ భవిష్యత్తుకు విద్యార్థులే పునాదులని తాడిహత్నూర్ గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు బలిరాం అన్నారు. గురువారం పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా మాజీ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మెన్ రుక్మబాయి, సాహిత్య సేవ ఫౌండేషన్ అధ్యక్షులు ఆత్రం మోతీరాం, వార్డెన్ దీప్‌సింగ్, పాఠశాల ఉపాధ్యాయులు గాయకుడు కవన కోకిల బంకట్‌లాల్, రామేశ్వర్, తానాజి, శ్రీనివాస్, బలరాం, విజయ్, రవీందర్, సతీష్, రాజేష్‌బాబు, పరశురామ్, వసంత, మోతీరాం, పోషకులు పాల్గొన్నారు.



ఒత్తిడి లేకుండా ప్రణాళికతో చదవాలి

● ఎంసెట్ కోచింగ్ సెంటర్‌ను సందర్శించిన కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు ఒత్తిడి లేకుండా ప్రణాళితో చదవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఎంసెట్ కోచింగ్ సెంటర్‌ను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులకు ఇక్కడ అందిస్తున్న బోధన వివరాలు, ఇతర సౌకర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వసతులు బాగున్నాయని, చలి కాలంలో వేడి నీటి సౌకర్యం కల్పించాలని విద్యార్థులు కలెక్టర్‌ను కోరారు. దీనిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదవుల కోసం కష్టపడి చదవాలన్నారు. ప్రభుత్వ పరంగా ఎంసెట్ కోచింగ్‌ను ఉచితంగా అందిస్తున్నామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుంటూ మంచి ర్యాంకులు సాధించాలన్నారు. తమ సందర్శనలో కొన్ని లోటుపాట్లు దృష్టికి వచ్చాయని వాటిని పరిష్కరించేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించడం జరిగిందన్నారు. కష్టంతో కాకుండా ఇష్టంతో చదవుతూ మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఇంట్లో ఉండి ఆరు గంటల వరకే చదువుతారని, ఇక్కడ వసతి ఉండటంతో 10 నుంచి 12 గంటల వరకు చదివే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఐఈఓ రవీందర్ కుమార్, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, ఎంసెట్ క్యాంప్ కోఆర్డినేటర్ గణేష్, అకాడమీక్ ఇన్‌చార్జి సూర్యప్రకాష్, సూపరింటెండెంట్ మోసిన్ ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని రాస్తారోకో



నవతెలంగాణ-భైంసా

ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ, లోకేశ్వరం మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన రైతులు రాస్తారోకో చేపట్టారు. ఆ గ్రామానికి 20 కిలోమీటర్ల దూరంలోని నిర్మల్, భైంసా రహదారిపై అర్లి ఎక్స్ రోడ్డు వద్దకు ఉదయం 10 గంటలకు చేరుకొని, రాస్తారోకో నిర్వహించారు. దీనితో వందలాది వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, 40 రోజులు గడిచినా ధాన్యం తూకం వేయడం లేదని, తూకం వేసిన 6 లారీల ధాన్యాన్ని రైస్ మిల్లుకు పంపినా తాలు, తప్ప ఉందనే సాకుతో మిల్లర్లు ధాన్యాన్ని దింపుకోవడం లేదని అన్నారు. క్వింటాలు ధాన్యానికి అదనంగా ఏడు కిలోలు ఇచ్చినా మిల్లర్లు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం చేతికి వచ్చి 45 రోజులు గడిచినా కొనుగోలు ప్రారంభించకపోవడంతో ఆ గ్రామ రైతులు బుధవారం కులగణన సర్వేను బహిష్కరించారు. అయినా అధికారులు స్పందించకపోవడంతో రైతులు రాస్తారోకో చేపట్టారు. అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు కదిలేది లేదని రైతులు తెలిపారు.

ఆరోగ్యకరమైన అలవాట్లు ఉండాలి

నవతెలంగాణ-బోథ్



ఉన్నతమైన భవిష్యత్తుకు ఆరోగ్యకరమైన అలవాట్లు ఉండాలని డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్ అన్నారు. గురువారం మండలంలోని సొనాల జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉంటేనే ఉన్నతశిఖరాలకు చేరుకుంటారని, విద్యార్థులకు సూచించారు. అలాగే చెడు అలవాట్లకు దూరంగా ఉండి, మంచి అలవాట్ల మార్గంలో నడువాలని అన్నారు. జిల్లాలోని మూడు ఆరోగ్య పాఠశాలలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అందులో సొనాల గ్రామాన్ని ఎంపిక చేసి ఆరోగ్య పాఠశాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అందులో విద్యా, వైద్యం, శిశు సంక్షేమ శాఖ, నుంచి ప్రతి వారంలో ఆరు రోజుల పాటు శిక్షణలు సూచనలు ఉంటాయని తెలిపారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు మంచి చదువులు చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. అలాగే మత్తుకు డ్రగ్స్‌కు దూరంగా ఉండి మంచి అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో నడువాలని సూచించారు. సొనాల జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కొరకు ప్రభుత్వం ద్వారా రూ.10లక్షలు మంజూరు చేసి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో శిశుసంక్షేమ శాఖ అధికారి మిల్కా, ఎంఈఓ పోశెట్టి, డాక్టర్ నవీన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు సచిన్, మాజీ సర్పంచ్ సదానందం, పాల్గొన్నారు.

అధికారులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వికారాబాద్ జిల్లాలోని లగచర్ల గ్రామంలో జిల్లా కలెక్టర్, అధికారులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని జిల్లా ఉద్యోగ జేఏసీ చైర్మెన్ సంద అశోక్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. దాడి చేసిన వారిని శిక్షించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యోగ జేఏసీ చైర్మెన్ సంద అశోక్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న ఉన్నత అధికారులపై రైతుల పేరిట కొందరు దాడి చేయడం సిగ్గుచేటన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే గ్రామసభలో వ్యక్తపర్చాలన్నారు. కానీ అధికారులపై దాడులు చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా కార్యదర్శి ఎ.నవీన్ కుమార్, టీజీఓ బాధ్యులు కాండ్లి శివ కుమార్, రెవెన్యూ యూనియన్ సంఘం సభ్యు రాజేశ్వర్, వర్ణ, రామ్‌రెడ్డి, శ్రీధర్, కె.అనిల్, వామన్ రావు, సొగల సుదర్శన్, నాలుగో తరగతి యూనియన్ కార్యదర్శి ఇందిరా, టీజీఓ యూనియన్ గౌరవాధ్యక్షులు రాజేందర్, టీఎన్జీవోస్ బాధ్యులు గోపి, గంగాధర్, రాజేశ్వర్, మహేందర్, అరుణ్, వార్డెన్ బాధ్యులు నర్సింలు, ఓం ప్రసాద్, దత్తు, మహిళా ఉద్యోగులు సుజాత, రాధ, ఆరతి, రజినీ పాల్గొన్నారు.

సహకార సంఘాల ద్వారా సేవలందిస్తున్నాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సహకార సంఘాల ద్వారా రైతులతో పాటు అవసరమైన వారికి రుణాలు అందిస్తూ నాణ్యమైన సేవలు అందిస్తున్నామని, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. గురువారం నుంచి ఈనెల 20వ తేది వరకు సహకార వారోత్సవాలు కొనసాగనున్నాయి. తొలి రోజు డీసీసీబీ బ్యాంక్‌లో సహకర జెండాను చైర్మెన్ అడ్డి బోజారెడ్డి ప్రారంభించారు. అనంతరం సహకార గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి మాట్లాడుతూ భారత దేశతొలి ప్రధాన మంత్రి నెహ్రూ సహకార బ్యాంకులను స్థాపించారన్నారు. ఆయన జయంతి నవంబర్ 14 నుంచి 20వ తేది వారోత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఇందులో బ్యాంకుల ద్వారా అందించే సేవలపై ప్రజలు, రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో రూ.15 వందల కోట్ల రుణాలను అందించామన్నారు. 70 సంఘాలు, 42 బ్రాంచ్‌ల ద్వారా సేవలను అందిస్తున్నామన్నారు. రైతులు సహకార బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోని, సకాలంలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీఈఓ శ్రీధర్‌రెడ్డి, డీజీఎం భాస్కర్‌రెడ్డి, ఏజీఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.



సింగరేణి ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం

తాండూర్: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రిలో గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ వల్ల స్పెషల్ వార్డులో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో స్పెషల్ వార్డు పైకప్పు ఏసి యంత్రం దగ్ధమైంది. గమనించిన వైద్య సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి, సింగరేణి అధికారులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అగ్ని ప్రమాదం ఘటనతో రోగులు బెంబేలెత్తుతున్నారు. వీఐపీల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పెషల్ వార్డులో ఈ ప్రమాదం జరిగింది. గతంలో కూడా హాస్పిటల్లో ఐసీయూ విభాగంలో విద్యుత్ షాక్‌తో మంటలు చెలరేగాయి. హాస్పిటల్ విద్యుత్ వైరింగ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. విద్యుత్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించిందన్న ఆరోపణలున్నాయి. తత్ఫలితంగా హాస్పిటల్‌లో తరచు అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని కార్మికుల ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం, విద్యుత్తు విభాగం అధికారులు హాస్పిటల్‌లో పటిష్టమైన వైరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కార్మికులు కోరుతున్నారు.

ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ

లక్షెట్టిపేట : పట్టణంలోని ఆశ్రమ పాఠశాలను జిల్లా కోపరేటివ్ అధికారి బి.సంజీవరెడ్డి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. గురువారం ఆకస్మిక పర్యటనలో భాగంగా ఆశ్రమ పాఠశాలల తనిఖీ చేశారు. భోజన సదుపాయాలు, డైనింగ్ హాల్, సానిటేషన్ నిర్వహణ పరిశీలించారు. పిల్లలకు ఇచ్చే ప్రాథమిక ఆరోగ్య కిట్స్ గడువు తేదీ ముగిసిన విషయంలో, స్టాక్ రిజిస్టర్ విషయంలో సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్యం గురించి ఏఎన్ఎం, సిబ్బందికి తగు సూచనలు చేశారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా వెంకట్రావుపేట గ్రామ పంచాయతిని తనిఖీ చేశారు. గ్రామంలో సానిటేషన్ నిర్వహణను పరిశీలించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సరోజ, ఏఎస్ఓ అరుణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ దీపవాహిని, పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ, ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

వసతిగృహంలో శుభ్రత పాటించాలి

జైపూర్: పాఠశాల పరిసరాలతో పాటు వసతిగృహం వంట గది ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు సూచించారు. మండల కేంద్రంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(కోటపల్లి)ని గురువారం సందర్శించారు. పాఠశాల పరిసరాల్లో పారిశుధ్య పనులు నిరంతరం చేయాలన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ ఆహారం తినే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. విద్యార్థుల హాజరు శాతం, భోజనం వండి వడ్డిస్తున్న తీరు పరిశీలించారు.

నర్సరీ పనులు త్వరగా పూర్తి చేయాలి

వాంకిడి:నర్సరీ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నర్సరీ పనులకు పాలిథిన్ కవర్లు వచ్చాయన్నారు. అన్ని గ్రామ పంచాయతీలలో ఎర్రమట్టి, చెరువు మట్టి, ఎరువు తెప్పించి బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తి చేయాలని తెలిపారు. ఈ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి మొక్కల పెంపకానికి కావాల్సిన విత్తనాలు తెప్పించాలని పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. అలాగే గ్రామాలలో సానిటేషన్ చేయించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. త్వరలోనే ఉపాధి హామీ సామాజిక తనిఖీ బృందం మండలానికి రానుందని, అన్ని రికార్డులు మరోసారి సరిచూసుకొనీ తనిఖీ బృందానికి ఇవ్వడానికి సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ జావీద్, ఏపీఓ శ్రావణ్ కుమార్, ఈసీ మోసిన్ ఉన్నారు.

అతిథి ఉపాధ్యాయ పోస్టులకు రేపు ఎంపిక

ఆసిఫాబాద్ :జిల్లాలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న వివిధ రకాల ఉపాధ్యాయ పోస్టులకు అతిథి ఉపాధ్యాయ ఎంపిక ప్రక్రియ 16న నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయకర్త బి.శ్వేత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూనియర్ లెక్చరర్ విభాగంలో వృక్షశాస్త్రం, గణిత శాస్త్రంలో ఒకటి చొప్పున, పీజీటీ ఇంగ్లీష్‌లో ఒకటి, టీజీటీ విభాగంలో తెలుగు, హిందీల్లో ఒకటి చొప్పున, గణితం, ఆంగ్లంలో రెండు చొప్పున ఖాళీగా ఉన్నాయన్నారు. ఎమ్మెస్సీ బీఈడీ, ఎంఏ బీఈడీ, టెట్ పూర్తయిన వారు అర్హులని, ఆసక్తి గలవారు రేపు ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రాల్లోని ఎంజీపీ జూనియర్ కళాశాలలో ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

నాయీబ్రాహ్మణ సేవా సంఘం కమిటీ ఎన్నిక

ఆసిఫాబాద్ : పట్టణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీని ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు కుదురుపాక సిద్దేశ్వర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. పట్టణ కమిటీ గౌరవ అధ్యక్షులుగా జూలూరు శేఖర్, అధ్యక్షులు ఎనగందుల సందీప్, ఉపాధ్యక్షులు జూలూరి విలాస్, ప్రధాన కార్యదర్శి కుదురుపాక దీపక్, కోశాధికారి కొదురుపాక హరిచరణ్, సంయుక్త కార్యదర్శి సొన్నాయిల శిరీష్, ముఖ్య సలహాదారుడు జూలూరి సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

వ్యాక్సినేషన్ ప్రక్రియ పూర్తి స్థాయిలో జరగాలి

● మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్

పుట్టినప్పటి నుండి పిల్లలకు అందించాల్సిన వ్యాక్సినేషన్లను పూర్తి స్థాయిలో అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. హరీష్‌రాజ్‌తో కలిసి మంచిర్యాల, కుమ్రంభీం-ఆసిఫాబాద్ జిల్లాల వైద్యాధికారులు, సూపర్వైజర్లకు టీకాల కార్యక్రమం మైక్రో యాక్షన్ ప్లాన్ అమలు, సరైన రీతిలో టీకాలు అందజేత అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు పుట్టినప్పటి నుండి అందించాల్సిన టీకాలను కోల్డ్ చైన్ సిస్టమ్ నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా శిక్షణ పొందాలని తెలిపారు. పోలియో, మసూచి లాంటి ఎన్నో వ్యాధులను వ్యాక్సినేషన్ ద్వారా నిర్మూలించడం జరిగిందని, పిల్లలకు పుట్టినప్పటి నుండి ఓరల్ పోలియో వ్యాక్సిన్, డిపిటి, బిపిటి, మీజిల్స్, రూబెల్లా, హెపటైటిస్-బి ఇవ్వడం జరుగుతుందని, బర్త్ ప్లానింగ్‌లో వ్యాక్సిన్ ఎక్కడ తీసుకోవాలనే వివరాలను తెలియజేయాలని, సక్రమంగా అందించాలని తెలిపారు. కోల్డ్ చైన్ సిస్టమ్‌లో ఎలాంటి పొరపాట్లు చేయరాదని, ఐఎల్ఆర్‌డీ ఫ్రీజర్స్‌ను ఫార్మాసిస్టులు, స్టాఫ్ నర్సులు సక్రమంగా నిర్వహించాలని, డిపిటి డోస్ 5, 10, 16 సంవత్సరాలకు పాఠశాల ఆవరణలో అందజేయాలని, యువిన్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని, హెచ్ఎంఐఎస్‌లో అందజేసిన వ్యాక్సిన్ వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలలో ప్రతి బుధవారం, గ్రామాలలో ప్రతి శనివారం వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టాలని, పిల్లల వివరాలను ముందే తెలుసుకొని జాబితా ప్రకారం 100 శాతం వ్యాక్సిన్ అందే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పిల్లలలో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించి వ్యాధుల నుండి దూరం చేయడానికి వైద్య సిబ్బంది సమన్వయంతో పని చేయాలని తెలిపారు. జిల్లా ఇమ్యూనేషన్ అధికారి డా.అనిత, వైద్య-ఆరోగ్యశాఖ ఉప వైద్యాధికారి డా.సుధాకర్ నాయక్, డబ్ల్యుహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ అతుల్, రాష్ట్ర బృందం నుండి డా. జ్యోత్స్న, డా.మురారి డేవిడ్ వైద్యులకు, సిబ్బందికి టీకాలు, నిల్వలు, క్యారియర్ల నిర్వహణ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాక్సిన్‌పై తీసుకుంటున్న జాగ్రత్తలపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో డిపిహెచ్ఎన్ పద్మ, డిపిఓ ప్రశాంతి, సిహెచ్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వరి పంటకు మద్దతు ధర పొందాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం అమ్ముకొని మద్దతు ధర పొందాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం ఆసిఫాబాద్ మండలం అప్పపెల్లిలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎస్పి డివి. శ్రీనివాస్‌రావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 34 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి కొనుగోలు కేంద్రంలో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టార్పాలిన్ కవర్లు, గన్ని సంచులు, ధాన్యం ఆరబెట్టే యంత్రాలు, క్లీనింగ్ యంత్రాలను అందుబాటులో ఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు. ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు రావడానికి తేదీల వారీగా రైతులకు టోకెన్లు జారీ చేయాలని, నిబంధనల ప్రకారం 17శాతం తేమ ఉన్నట్లయితే కేంద్రానికి తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం ధాన్యంలో తేమ ఉండే విధంగా ధాన్యాన్ని ఆరబెట్టి, తప్ప, మట్టి గడ్డలు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తెలిపారు. వరి పంట పూర్తిగా ఆరిపోయిన తర్వాత కోతలు మొదలుపెట్టాలని, ఆ దిశగా వ్యవసాయ అధికారులు రైతులకు తెలియజేయాలని పేర్కొన్నారు. పూర్తిగా కోతకు రాని పొలాన్ని కోతలు చేస్తే హార్వెస్టర్‌ను సీజ్ చేయాలని తెలిపారు. తూకం జరిగిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని, రైస్ మిల్లర్లు ఎలాంటి ఆలస్యం లేకుండా ధాన్యాన్ని వెంటనే ఎక్కించుకోవాలని తెలిపారు. క్వింటాల్ ఎ గ్రేడ్ రకానికి రూ.2320, సాధారణ రకానికి రూ.2300 మద్దతు ధర చెల్లించడం జరుగుతుందన్నారు. పూర్తి సన్న రకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ చెల్లించడం జరుగుతుందని తెలిపారు. సన్న రకం, దొడ్డు రకం వడ్లు కొనుగోలు చేసేందుకు వేరువేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, జిల్లా మార్కెటింగ్, వ్యవసాయ శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.



ఘనంగా బాలల దినోత్సవం

నవతెలంగాణ-జైపూర్

ఇందారం గ్రామంలో గల ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం బాలల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. స్వయం పాలన దినోత్సవంలో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ దేశ మొట్ట మొదటి ప్రధాన మంత్రి పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఆయన జీవితం పిల్లలకు మార్గదర్శకమన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించిన తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, గోపగాని రవీందర్, రమేష్, కె.రమేష్, చక్రధర్, మంజుల, సంధ్యారాణి, ఎన్.పద్మ నవీన్ పాల్గొన్నారు.


జైపూర్ :


లక్షెట్టిపేట :

లక్షెట్టిపేట : పట్టణంలోని ఆశ్రమ పాఠశాలలో చిల్డ్రన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించారు. బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు గ్రీటింగ్ కార్డులు, వివిధ రకాల ప్రయోగాలు, చార్టులు తయారు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో ఏసీఎంఓ ఎం.రాజమౌళి, విద్యా కమిటీ చైర్మన్ కుమ్ర సుశీల, హాస్టల్ వార్డెన్, వివిధ గ్రామాల పటేళ్లు పాల్గొన్నారు.